ప్రజాశక్తి
బుధవారం 10 ఆగస్టు 2025
5
విజయనగరం



ఎరువుల అక్రమ నిల్వలపై చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎరువులను అక్రమంగా నిల్వలు చేసేవారిపై తీసుకుంటామని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన కలెక్టర్ ఫోన్ ఇన్ కార్యక్రమంలో 11 మంది రైతులు ఫోన్ చేసి కలెక్టర్‌తో మాట్లాడారు. తమకు 50 శాతం మాత్రమే రెండవ దఫా ఎరువులు అందాయని. ఇక వారం పది రోజుల్లో రెండో దఫా యూరియా వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతం జిల్లాలో 400 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రానున్న మూడు రోజుల్లో ఐపిఎల్ కంపెనీ ద్వారా 1000 మెట్రిక్ టన్నులు, కోరమాండల్ కంపెనీ ద్వారా 1000 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరుతుందని తెలిపారు. ఈనెల 25లోగా ఇంకో మూడు వేల మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు రానున్నందన్నారు. రైతు సేవాకేంద్రాల్లో యూరియా తీసుకున్న రైతుల జాబితా ప్రైవేట్ వ్యాపారులకు ఇవ్వడం ద్వారా ఒకే రైతు రెండు చోట్ల ఎరువులు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

అధ్యక్ష పీఠంపై ఉత్కంఠ

టిడిపి రథసారథి ఎవరో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ కొనసాగుతోంది. నూతన రథసారధి ఎవరో అన్న ఆసక్తి చర్చ పార్టీలకతీతంగా వినిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి నూతన రథసారధి ప్రకటన ఇంకా కొద్దిరోజుల సమయం పట్టవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జిల్లా అధ్యక్షుని ఎంపికతోపాటు పార్టీలోని 13 కమిటీల నియామకం విషయమై గతనెల 26న రాష్ట్ర కేంద్రం నుంచి త్రిసభ్య కమిటీ సభ్యులు (శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎమ్‌డి ఫరూక్, కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, విశాఖ దక్షణ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు) జిల్లాకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ రోజు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ కమిటీల ఛైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులతో అధ్యక్ష పదవిపై అభిప్రాయాలు సేకరించారు. వాస్తవానికి గజపతినగరం నియోజకవర్గం నుంచి ముగ్గురు, నెల్లిమర్ల నియోకజ వర్గం నుంచి ముగ్గురు, రాజాం నియోకజ వర్గం నుంచి ఒకరు మొత్తంగా ఏడుగురు అధ్యక్ష పదవికోసం దరఖాస్తు చేసుకున్నట్టు బోగట్టా. అభిప్రాయ సేకరణలో నలుగురు పేర్లు మాత్రమే చర్చకు వచ్చినట్టు విశ్వసనీయవర్గ సమాచారం. వీరిలో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి కంది చంద్రశేఖర్, సువ్వాడ రవిశేఖర్, గజపతినగరం నియోజకవర్గానికి చెందిన కరణం శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు పేర్లు ఉన్నాయి. ఇదే ప్రాధాన్యతలో నేతలు తమ అభిప్రాయాలను కూడా తెలియజేసినట్టు సమాచారం. కంది, సువ్వాడలలో ఎవరో ఒకర్ని అధ్యక్ష పీఠం వరించవచ్చనే ఊహాగానాలు ఎక్కువ మంది నోట వినిపిస్తున్నాయి. ఒకవేళ కందికి జిల్లా అధ్యక్షునిగా అవకాశం లేకపోతే, రాష్ట్ర కమిటీల్లో స్థానం లభిస్తుందని కొందరు విశ్లేషిస్తున్నారు. కరణం శివరామకృష్ణకు ఇవ్వాలని కూడా కొందరు కీలకనేతలు తమ అభిప్రాయాలను చెప్పినట్టుగా తెలుస్తోంది. అశోక్ బంగ్లాకు దూరంగా ఉన్న కోటరీ మాత్రమే ఎమ్మెల్యే కెఎ నాయుడుకు అవకాశమివ్వాలని కోరిందట. ఈ సంగతి కాస్త అటుంచితే, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన త్రీమెన్ కమిటీలు అభిప్రాయాలను సేకరించి అధినేత చంద్రబాబుకు పంపారట. అక్కడి నుంచి చినబాబు (పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి)కి వెళ్లాక ఫైనల్ అవుతాయని తెలిసింది. మన జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా కొద్దిరోజులుగా స్విజర్లాండ్‌లోని దావోస్ పర్యటనలో ఉన్నారు. ఆయన అందుబాటులోకి వచ్చాక మన జిల్లాకు సంబంధించిన త్రీమెన్ కమిటీ ఫైల్‌పై చర్చించి అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి అనుచరులు చెబుతున్నారు.

రైతులంటే చంద్రబాబుకు చిన్నచూపు

- ఎరువుల కొరతపై వైసిపి ఆధ్వర్యాన అన్నదాత పోరు
- ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిరసనలు
- ర్యాలీలను అడ్డుకున్న పోలీసులు
- చీపురుపల్లిలో తోపులాట
- పోలీసులకు, నాయకులకు వాగ్వివాదం



చీపురుపల్లిలో పోలీసులను తోసుకుంటూ ర్యాలీగా ముందుకు వెళ్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్/చీపురుపల్లి/బొబ్బిలి

రైతులంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిన్న చూపని, ఎరువుల అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం చలించడం లేదని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తీవ్ర ఎరువుల కొరత నేపథ్యంలో వైసిపి ఆధ్వర్యాన మంగళవారం అన్నదాత పోరు పేరిట ర్యాలీలు చేపట్టి ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. సకాలంలో ఎరువులు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఆధ్వర్యాన కలెక్టరేట్ సమీపంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయానికి భారీగా ర్యాలీ చేపట్టారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉన్నా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగని అన్నారని గుర్తు చేశారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఆర్‌బికెల ద్వారా ఎరువులను సకాలంలో అందించారని గుర్తు చేశారు. రైతులకు యూరియాను అందించక పోతే కూటమి ప్రభుత్వాన్ని ప్రజా కోర్టులో నిలబెడతామని తెలిపారు. అంతకు ముందు సమస్యలతో కూడిన వినతిని ఆర్‌డిఒ డి.కీర్తికి అందించారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ ఛైర్మన్ శోభా స్వాతిరాణి, నాయకులు గొర్లె రవికుమార్, గొర్లె సరయు, ఈశ్వర్‌కౌశిక్, సంగం రెడ్డి బంగారు నాయుడు , ఆశపు వేణు, కెల్ల త్రినాధరావు, మామిడి అప్పలనాయుడు, మోపాడ కుమార్, మూడు నియోకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు

పోలీసులు అడ్డగించినా ఆగని అన్నదాతలు

రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలను చూసి చలించి తాము రైతులతో కలసి రోడ్డుపైకి వచ్చామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లిలో వైసిపి కార్యాలయం నుండి చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ చేపట్టారు. డిఎస్‌పి రాఘవులు ఆధ్వర్యంలో రాజాం, చీపురుపల్లి సిఐలు, ఎస్ఐలతో కలసి ర్యాలీని అడ్డుకునేందుకు యత్నించారు. అయితే రైతులు పోలీసులను నెట్టుకుంటూ ముందుకు సాగారు. మూడు రోడ్లు కూడలి వద్ద కూడా మరోసారి రైతులను అడ్డుకునేందుకు బారికేడ్లు వేసి పోలీసులు ప్రయత్నించారు. అయినప్పటికీ అక్కడ కూడా రైతులు పోలీసులను నెట్టుకుంటూ ఆర్‌డిఒ కార్యాలయం వద్దకు వెళ్లి ఆర్‌డిఒ ఆశయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తూ అసలైన రైతులకు యూరియా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ ఇన్చార్జి తలే రాజేష్, చీపురుపల్లి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, గరివిడి మండలం నాయకులు మీసా విశ్వేశ్వరరావు, లెంక శ్రీరాములు, మెరకముడిదాం నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, గుర్ల మండలం నుండి పొట్నూరి సన్యాసినాయుడుతో పాట రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత పోరును అడ్డుకున్న పోలీసులు

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసిపి చేపట్టిన రైతు పోరును బొబ్బిలిలో పోలీసులు అడ్డుకున్నారు. నిరసన ర్యాలీ చేపట్టేందుకు బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు, రైతులు బొబ్బిలి వైసిపి కార్యాలయానికి చేరుకున్నారు. ర్యాలీ జరగకుండా అడ్డుకునేందుకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేదని, 15మందితో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని డిఎస్పీ భవ్యరెడ్డి, రూరల్ సిఐ నారాయణరావు మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కోరారు. తాము శాంతియుతంగా ర్యాలీ చేస్తామని చెప్పినప్పటికీ పోలీసులు అంగీకరించకపోవడంతో 15మందితో ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు యూరియాతో పాటు అర్హులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు



విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, రైతులు

యువత ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువత భవిష్యత్తు ఉన్నతంగా తీర్చు దిద్దుకోవాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మంగళవారం డిఆర్‌డిఎ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో మహిళా ప్రాంగనంలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని, యువతకు ఉపాధిఅవకాశాలు అందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచిందని అన్నారు. యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డి ఆర్‌డి ఎపిడి శ్రీనివాస్ పాణి సిబ్బంది పాల్గొన్నారు.

మరుపల్లిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - గజపతినగరం

'ఆ గ్రామానికి ఏమైంది' అంటూ మరుపల్లిలో వరుస మరణాలపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ సెక్రెటరీ మంత్రి రమణ, సర్పంచ్ లెంక సత్యనారాయణ పర్యవేక్షణలో మంగళవారం శానిటేషన్, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పంచాయతీ అధికారులు, వైద్య అధికారులు గ్రామంలో పర్యటించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపైన పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు, బురద మట్టిని, మరుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం యుద్ధ ప్రతిపాదికన జెసిబి సహాయంతో తొలగించారు. వర్షపు నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గత 15 రోజులుగా వర్షాలు కురవడంతో దోమలు పెరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. పిహెచ్‌సి వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి వైద్య సిబ్బంది గ్రామం మొత్తం యూరిన్, రక్త పరీక్షలు చేస్తున్నారు. ఒక్క రోజులోనే 897 మందికి డోర్ టు డోర్ సర్వే చేసి వైరల్ ఫీవర్ లేనట్లు నిర్ధారించారు. పలు రకాల ఆరోగ్య సూచనలు చేశారు. మరోపక్క మండలంలో ఉన్న కేవిఎస్‌ఆర్ పురం, మల్లు నాయుడుపేట, జిన్నాం, తుమ్ముకాపల్లి, ఎం.గుమ్మడం, లింగాలవలస గ్రామాల్లో డిఎల్‌పిఒ కిరణ్ కుమార్ విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపిడిఒ చల్ల సుగుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మరుపల్లిలో ఫాగింగ్ చేస్తున్న పిహెచ్‌సి, సచివాలయ సిబ్బంది

కెంగువలో జోరుగా పారిశుధ్య పనులు

మండలంలోని కెంగువ గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు జోరందుకున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వైరల్ ఇన్ఫెక్షన్, సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మరుగు కాలవల్లో పూడికతీత పనులు చేస్తున్నామని సర్పంచ్ ప్రతినిధి వైసిపి నాయకులు లెంక గణేష్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

లే అవుట్ క్రమబద్ధీకరణపై అవగాహన : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లేఅవుట్ క్రమబద్ధీకరణ విధానాన్ని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని లైసెన్సెడ్ టెక్నికల్ పర్సన్స్‌కు, ప్రణాళిక కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లే అవుట్ క్రమబద్ధీకరణ విధానానికి మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉందని, ఈలోగా ప్రతి ఒక్కరూ లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసుకునే విధంగా చైతన్యం తీసుకురావాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు పాల్గొన్నారు.



సురవరం సుధాకరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు పార్టీల నాయకులు

ప్రజా పోరాట యోధుడు సురవరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిత్య అధ్యయన శీలి, మార్కిస్ట్ ఉపాధ్యాయులు, ప్రజా పోరాట యోధుడు సిపిఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. సుధాకర్‌రెడ్డి మరణం భారత దేశ కమ్యూనిస్టుఉద్యమానికే తీరనిలోటని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టులంతా ఐక్యం కావాలని కోరుకుంటున్న తరుణంలో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికంగా దూరం కావడం బాధాకరమని పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం అమర్ భవన్‌లో సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ (ఎం) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బెహరా శంకర్రావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, టిడిపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్, లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు టి.రాజారావు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సుధాకర్‌రెడ్డి అగ్రగణ్యుడని అన్నారు. ఆయనలేని లోటు భారత కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే కాదు వామపక్ష పార్టీలు అన్నిటికీ తీర్చలేనిదని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలపై కమ్యూనిస్టు నాయకులను, ప్రజలను ఎప్పకప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు వాటికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నిర్వహించారని తెలిపారు. విద్యార్థి యువజన నేతగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తుకున్నారు. ఆయన వ్యక్తితం, జీవితం, ఉద్యమం క్రియాశీల మార్గ దర్శకత్వం నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన సద్గుణాలలో కొన్నైనా అలవర్చుకొని ఆచరించడం ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, అలమండ ఆనందరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణ స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల రద్దుకు పోరాటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన సత్తెన పల్లి రామకృష్ణ స్ఫూర్తితో రాష్ట్రంలో అదాని స్మార్ట్ మీటర్లు రద్దయ్యేవరకు పోరాడుతామని సిపిఎం నగర కార్యాదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. విద్యుత్ పోరాటంలో రామకృష్ణ అశువులుబాసి 25 ఏళ్లయిన సందర్భంగా మంగళవారం అయన వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో రామకృష్ణ నగర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు తొలుత రామకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పి ప్రజలను మోసగించారని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఇళ్లకు వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఎం.శాంతమూర్తి, స్థానిక నాయకులు ఎం.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నసిపిఎం నాయకులు,కార్యకర్తలు

సిపిఎస్ ఉద్యోగులందరికీ డిఎ బకాయిలు చెల్లించాలి : ఆపస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్ ఉద్యోగులందరికీ బకాయి ఉన్న డిఎను ప్రభుత్వం చెల్లించాలని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం జ్యుడీషియల్, అసెంబ్లీ ఉద్యోగులకు మాత్రమే డిఎ బకాయిలను చెల్లించిందని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎపి సచివాలయ సిపిఎస్ ఉద్యోగులకు 5ఏళ్లగా సిఎఫ్ఎంఎస్ గ్రీన్ ఛానల్‌లో ఉన్న 60 నెలల డిఎ బకాయిలను చెల్లించిందని తెలిపారు. ప్రభుత్వాలు ఇలా డిపార్టుమెంట్ వారీగా ప్రాధాన్యత ఇవ్వడం సరైన పద్ధతి కాదనీ,అసలు మొదటిగా ఇవ్వాలంటే నిరంతరం, నిస్వార్థంగా సేవా భావంతో, నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ వర్గాన్ని కలుపుకొని అందరి సిపిఎస్ ఉద్యోగులకు ఇన్‌కం టాక్సు కట్టిన డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

యువతకు కేంద్ర పథకాలు చేరువ కావాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మేరా యువ భారత్ (మై భారత్) ఆధ్వర్యంలో కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆదేశాల మేరకు సీతం కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా యువజన అధికారి ఎన్. ప్రేమ్ భరత్‌కుమార్ మాట్లాడుతూ, యువత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆపథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ సాయిరాం, సెట్విజ్ మేనేజర్ కె.వి. రమణ పాల్గొని ఆయుష్మాన్ భారత్, స్కిల్ ఇండియా వంటి పథకాల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో సీతం ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి ఎన్.సతీష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

'సీతం'లో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మాక్సివిజన్ ఉచిత కంటి తనిఖీ శిబిరం నిర్వహించారు. సీతం ఎన్ఎస్ఎస్ యూనిట్, మాక్సివిజన్ ఐ కేర్ సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిలో కంటి ఆరోగ్యం, అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ బి. సంతోష్ కుమార్, ఆప్టో మెట్రీ డి. నవీన్, కె.గౌరీశంకర్ (కౌన్సెలర్), యు. సంతోష్ (టెక్నీషియన్) వైద్య సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలు విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగ పడతాయని అన్నారు. ప్రిన్సిపల్ డివి రామమూర్తి పాల్గొన్నారు.

ఐటి పార్కుల కోసం భూములు గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లాలో ఐటి పార్కులను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూములను గుర్తించాలని కలెక్టం బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజాపులోవ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 15 కిలోమీటర్ల పరిధిలో స్థలాలను గుర్తించాలని సూచించారు. ఒక్కో బ్లాకు కనీసం వంద ఎకరాలు ఉండేలా చూడాలన్నారు. ఇలా సుమారు 5వేల ఎకరాలను గుర్తించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ భూములకు ప్రాధాన్యత ఇవ్వాలని, లేని పక్షంలో ప్రయివేటు భూములను గుర్తించాలని సూచించారు. ఈ భూములకు జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు ఉండేలా చూడాలని చెప్పారు. భూములను గుర్తించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన నిర్వహించి, బుధవారం నాటికి నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి మురళి, సర్వేశాఖ ఎడి రమణమూర్తి, తాహశీల్దారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలి

వ్యవసాయానికి నీటి సదుపాయాలను మెరుగు పరచాలని, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల ఇంజినీర్లు, ప్రభుత్వ శాఖల అధికారులతో తమ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువ వ్యవసాయం చిన్నచిన్న చెరువుల పైనే ఆధారపడి ఉందన్నారు. చెరువులను మరమ్మతు, అభివృద్ధి చేసి, నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. దీనికోసం చెరువులను సర్వే చేసి, వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. రోజుకు కనీసం 100చొప్పున చెరువులను పరిశీలించి, వారం లోపల 800 చెరువుల అభివృద్ధికి ప్రాజెక్టు రిపోర్టులను సిద్ధం చేయాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో చెక్ డ్యామ్‌లు, ఫారమ్ పాండ్స్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్ఇ ఆర్.అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎస్.కవిత, ఇరిగేషన్ విజయనగరం ఇఇ ఎన్‌వి రమణ, పార్వతీపురం ఇఇ డిఎస్.ప్రదీప్, డ్వామా పీడీ శారదాదేవి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిమ్స్ చర్చి 150 వసంతాల వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మత సామరస్యానికి నెలవైన సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ (ఎస్ఎంబి) చర్చి 150 వసంతాల వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమౌతాయని సిమ్స్ చర్చ్ సంఘమిత్ర డాక్టర్ ఆర్ ఎస్ జాన్ వెల్లడించారు. మంగళ వారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన విజయనగరం సిమ్స్ చర్చ్ కెనడా మేరీ టైం బాప్టిస్టు మహాసభకు చెందిన డాక్టర్ సేన్ ఫోర్డ్ భీమిలి నుంచి ఇక్కడకు విచ్చేసి 1875 నవంబర్ 19-22 తేదీల్లో ఇక్కడ సంఘాన్ని స్థాపించారని తెలిపారు. తర్వాత కాలంలో దీనిని సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ గా మార్చినట్లు తెలిపారు. అలా సిమ్స్ స్థాపితమై నేటికి 150 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఈనేపథ్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఈ వేడుకలు ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 14 వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐదు రోజుల పాటు ' విజయనగరం క్రైస్తవ మహా సభలు ' నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

వేపాడ: మండలంలోని వెల్లం గ్రామంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య, గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 25 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రైతులకు పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రు పాలను అప్పుడే పుట్టిన పెయ్యలకు, దూడలకు పట్టడం వల్ల కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలు మీద అవగాహన కల్పించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి తెలిపారు. ఈ శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

వేపాడ: మండలంలోని కేజీపూడి సచివాలయం పరిధిలోని బంగారయ్యపేట గిరిజన గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం పట్టించుకోకపోగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలతోనే సరిపెడుతోంది. గత్యంతరం లేక బంగారయ్య పేట, సొంటివానిపాలెం గ్రామ గిరిజనుల పిల్లలు కనీస సౌకర్యాలు కూడా లేనటువంటి ప్రమాదకరంగా ఉక భవనంలోనే చదువులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గిరిజనుల పిల్లలు చదువుకునేందుకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

శిథిలావస్థకు చేరిన బంగారయ్యపేట పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. పిల్లలతో మాట్లాడి పాఠశాల భవనం మంజూరుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కొండగంగుపూడి, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం పరిశీలనలో ప్రతి పిల్లవాడికి చదవడం రాయడం తప్పనిసరిగా రావాలని సూచించారు.

కౌన్సిలర్ చొరవతో గుంతలు పూడ్చివేత

నెల్లిమర్ల: స్థానిక రామతీర్థం జంక్షన్ రైల్వే బ్రిడ్జి కింద గుంతలను కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ చొరవతో మంగళవారం పూడ్చివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి ప్రయాణికులు చాలా ఇబ్బంది పడడంతో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ చొరవ చూపించి సిమెంట్, కాంక్రీట్‌తో తాత్కాలికంగా గుంతలను పూడ్చివేశారు. ఈ కార్యక్రమానికి కానిస్టేబుల్ అసిరయ్య, విజయ్ కుమార్, కారుకొండ రవి, పొంతపల్లి శ్రీనివాస, లెంక అశోక్, ఇప్పిలి రాజు సహకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నెల్లిమర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ టి. జయరాం, నగరపంచాయతీ చైర్పర్సన్ బంగారు సరోజినీ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ నగర్ కాలనీలోని 13వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి అన్నపూర్ణ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయవలస పంచాయతీకి చెందిన రాజేంద్ర, బంగారమ్మ దంపతుల కుమార్తె నందిని హార్ట్ ప్రాబ్లంతో విశాఖపట్నంలో ప్రైవేట్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. దీని కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.1.30లక్షలు ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పతివాడ శ్రీను, వందనాల అప్పలరాజు పాల్గొన్నారు.

బొబ్బిలిలో మాజీ సైనికుల సమ్మేళనం

బొబ్బిలి: మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెవిఎస్ ప్రసాదరావు మాజీ సైనికులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం బొబ్బిలిలో మంగళవారం నిర్వహించారు. మాజీ సైనికుల కోసం ఆయుల జరుగుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ విజయనగరంలో ఈసిహెచ్ఎస్ పాలిక్లినిక్ మాజీ సైనిక కుటుంబాల కోసం మంజూరు అయిందని విజయనగరం మిమ్స్ హాస్పిటల్‌ను ఈసిహెచ్ఎస్ ఎంపానెల్ మెంట్ హాస్పిటల్‌గా కేంద్ర రక్షణ శాఖ గుర్తించిందని, ఈ రెండు త్వరలో సేవలు ప్రారంభించబోతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షులు మరడ రామునాయుడు, అధ్యక్షులు రేవళ్ల కిరణ్‌కుమార్, కార్యదర్శి ఎ.గోవిందనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఆర్ మోహన్‌రావు, కోశాధికారి వియన్ శర్మ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

లక్కవరపుకోట: మండలంలోని మార్లపల్లి అగ్ని ప్రమాద బాధితులకు ఎంపిపి గేదెల శ్రీనివాసరావు చేయూతనందించారు. ఇటీవల అగ్నిప్రమాదంలో ఐదు పూరిళ్లు కాలిపోగా బాధితులకు మంగళవారం కనిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 25కిలోల చొప్పున బియ్యం, ఐదు జతలు బట్టలు, విద్యార్థులకు బెల్ట్ బుక్కులు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన, నాయకులతో పాటు ఎంపిటిసి ఎర్ర కిషోర్ కుమార్, మండల యువజన అధ్యక్షులు తూర్పటి అప్పలరాజు, రేగా ఎంపిటిసి బొద్దు గణపతి, వజ్రం శ్రీను, పెద్దిరెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షల బీమా చెక్కు అందజేత

రామభద్రపురం: మండల కేంద్రానికి చెందిన జనసేన కార్యకర్త కోడూరు షణ్ముఖరావు (28) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆ పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి బీమా పరిహారం రూ.5 లక్షలు విడుదల చేసి సంబంధిత చెక్కును స్థానిక జనసేన నాయకులు మహంతి ధనుంజయ చేతుల మీదుగా మృతుని భార్యకు మంగళవారం అందజేశారు. ఈ చెక్కును ఆమె బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, నాయకులు మజ్జి సురేష్, ముల్లు గణపతి, అల్లు రమేష్, కనకల శ్యాం, చీమల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉచిత పరీక్షలు

శృంగవరపుకోట: జామి మండల కేంద్రంలో మంగళవారం మాతృభూమి సేవా సంఘం, ఎంవిఎన్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు వర్మరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నవ్యను సత్కరించారు. కేన్సర్ రోగులకు ఎస్.కోటలో మెడికల్ క్యాంపు పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, కళ్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. వందమంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యరకమంలో జనసేన నాయకులు కొల్లి సురేంద్ర, ఎంవిఎన్ బ్లడ్‌బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులు కూలుతున్నాయి

- నిలిచిపోయిన రాకపోకలు
- ప్రయాణికులకు అవస్థలు
- అత్యవసర వాహనాలు వెళ్లలేని పరిస్థితి
- మొద్దునిద్ర వదలని అధికారులు

అలర్ట్!.. ఆర్అండ్‌బి రహదారుల్లో కల్వర్టుల మీదుగా వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారా.? అయితే మీకో హెచ్చరిక!!. కల్వర్టుకు కొద్దిదూరంలోనే వాహనాన్ని ఆపి, ఓసారి అలా నాలుగు అడుగులు వేసి, కల్వర్టులను పరిశీలించాకే వాహనాన్ని ముందుకు పోనీయండి. లేకుంటే ఏదైనా ప్రమాదం బారిన పడొచ్చు సుమా!. ఎందుకంటే..? మండలంలో ఆర్అండ్‌బి మార్గాల్లో కల్వర్టుల పరిస్థితి అలా తయారైంది. ముందుచూపు లేని పాలకులు, మొద్దునిద్ర వీడని అధికారుల వల్ల ప్రజలకు, ప్రయాణికులకు నిత్యం పాట్లు తప్పడం లేదు మరి!

ప్రజాశక్తి- సంతకవిటి

మండలంలోని పిజెపేట (పోతులజగ్గుపేట), సంతకవిటి, గరికపాడు గ్రామాల్లో కల్వర్టులు కూలిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, నానా ఇబ్బందులు పడుతున్నారు. కూలిన కల్వర్టులతో వారధులు వేదన చెందుతున్నా కనీసం అధికారులకు పట్టడం లేదు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్న ఈ కల్వర్టులు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. ప్రధాన రహదారుల కల్వర్టులనే అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో వాహనదారులు బిక్కు బిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు.

ఇదీ పిజెపేట కల్వర్టు పరిస్థితి

నారాయణపురం కుడి ప్రధాన కాలువ నుంచి చిత్తారిపురం వరకు సాగునీరు అందించే హొంజరాం కాలువపై ఈ కల్వర్టు ఉంది. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు వరద నీటి ప్రవాహం పెరగడం, భారీ వాహనాలు తిరగటంతో కల్వర్టు శిథిలమై ఒకవైపు కూలిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరిగేందుకు అవకాశం మాత్రమే ఉంది. అయితే ఈ కల్వర్టు కూలిపోవడంతో రాజాం నుండి చిత్తారిపురానికి వెళ్లే ఆర్‌టిసి బస్సు సంతకవిటి మండల కేంద్రానికే పరిమితమైంది. మూడు కూడలి ప్రధాన రహదారి కావడంతో శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు మాత్రమే వెళ్లే విధంగా రహదారికి అడ్డంగా అధికారులు గోడను కట్టారు. అయితే కనీసం ఈ రహదారి గుండా అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో తమరాం, హొంజరాం, చిత్తారిపురం, గుజ్జన్నపేట, పోడలి, బూరాడపేట గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లటానికి నానా అవస్థలు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు.



ఇదీ గరికపాడు వద్ద పరిస్థితి

కూలిన గరికపాడు కల్వర్టు

గరికిపాడు గ్రామంలోని కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో కొద్ది రోజులుగా కురిసిన వర్షాలు రహదారికి ఒక పక్కన కూలిపోయి ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో రాజాం నుంచి సంతకవిటికి వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినప్పటికీ.. పనులు ప్రారంభం కాలేదు. ఇంకా ఎప్పుడు ప్రారంభిస్తారోనని వాహన దారులు ఎదురుచూస్తున్నారు.

శిథిలం..సంతకవిటి కల్వర్టు

సంతకవిటి మండల కేంద్రానికి సమీపంలో పిల్ల కాలువపై ఉఎఉన్న కల్వర్టు కూలిపోయింది. దీంతో ఎంఆర్ అగ్రహారం, గోళ్ళవలస, వాసుదేవపట్నం, కొండగూడెం, శ్రీహరినాయుడుపేట గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కల్వర్టు కూలిన ప్రాంతంలో రాళ్లు, మట్టి వేసి కప్పేశారు. వర్షాలకు కూలడంతో ఆ రహదారి అధ్వానంగా తయారైంది. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



పిజెపేట వద్ద తాత్కాలికంగా నిర్మిస్తున్న గట్టు

మండలంలోని ఎక్కడికక్కడ కల్వర్టులు కూలిపోవడంతో కనీసం ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మండలంలోని నూతన కల్వర్టులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస కస్తూరిబా పాఠశాలలో మంగళవారం రూ.1.60 కోట్లతో నిర్మించిన ఇంటర్ కళాశాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో పాఠశాలలు, కళాశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తేవడానికి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఏటా ఉత్తీర్ణతా శాతం పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, సర్వశిక్షా ఎపిసి రామారావు, కస్తూరిభా పాఠశాల ప్రిన్సిపాల్ దీపా, తహశీల్దార్ అజురఫీజాన్, ఎంపిడిఒ రత్నం, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, టిడిపి మండల క్లస్టర్ ఇంఛార్జి గంట సాయి, వివిధ గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో మంగళవారం రూ.50 లక్షలతో మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో కోట్లాది రూపాయలతో బీటీ రోడ్లు, విధి కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు విరివిగా మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నల్ల కుర్మారావు, పల్లా చంద్రరావు, సంగిరెడ్డి ప్రసాదరావు, మరిపి కృష్ణమూర్తి, గొర్లె శ్రీనివాసరావు, పెద్దింటి పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల చలో ఢిల్లీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులను రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు గానీ ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నేతృత్వంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత విశాఖ చేరుకొని అక్కడ నుంచి చలో ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ గత 80 రోజులుగా సర్వం కోల్పోయిన జిందాల్ బాధితులు తమ భూమి తమకు ఇచ్చి ఆదుకోవాలని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పెద్దల గాని, జిల్లా, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోలేదన్నారు. జిందాల్ యాజమాన్యానికి అందరూ అనుకూలంగా మారడంతో తమ గోడు వినిపించేందుకు దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరుతున్నట్టు తెలిపారు. కంపెనీ పేరుతో పేదల వద్ద ఉన్న డీ పట్టా భూములు మొత్తం దోచుకొని నిర్వాసితులకు అన్యాయం చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. భూములు తీసుకుని పరిశ్రమ పెట్టకపోగా ఇప్పుడు ఆ భూములను రియల్ ఎస్టేట్‌కు అమ్మేందుకు సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిర్వాసితులకు జరిగిన అన్యాయాన్ని ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వానికి, మానవ హక్కుల సంఘాలకి తెలియజేసేందుకు వెలుతున్నట్టు జగన్ తెలిపారు.



చలో ఢిల్లీ బయలుదేరిన నిర్వాసితులు

ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికతో మేలు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 102 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొదటి రోజు ఈ వేదికలో 10 గ్రామాలు పాల్గొన్నాయని, 10 గ్రామాల రైతులు వివిధ రకాల భూ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారని ఆయన తెలిపారు. రైతులకు భూ సమస్యలుంటే ఇదే మంచి సదా అవకాశమని ఆయన తెలిపారు. బుధవారం కూడా ఈ పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. ప్రత్యేక ప్రజా సమస్య పరిష్కార వేదికను ఆర్‌డిఒ దాట్ల కీర్తి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిటి టి రమేష్, ఎంఆర్ఐ కె.సన్యాసిరావు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కలుషిత నీటిపై విచారణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ యాజమాన్యం అవుట్ చెరువులలో రసాయనిక వ్యర్థ పదార్థాలు వదలడంతో చెరువులు కలుషితమై తమ పంటలు నాశనం అవుతున్నాయని మజ్జి రాముడుపేట గ్రామానికి చెందిన వారు స్పందనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మంగళవారం విజయ నగరం జిల్లా పొల్యూషన్ ఎఇ శ్యామల అవుట్ చెరువులను పరిశీలించారు. చెరువు గర్భంలో ఉన్న కలుషిత వ్యర్థ పదార్థాల నీటిని శాంపుల్ తీసుకున్నారు. పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించి రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని పొల్యూషన్ అధికారిని తెలిపారు.

చెరువును తలపిస్తున్న కలెక్టరేట్ ప్రాంగణం

కంటోన్మెంట్: చినుకు పడితే చాలు కలెక్టరేట్ ప్రాంతం చెరువులా మారుతోంది. మోకాలి లోతులో నీరు నిల్వ ఉండడం వల్ల ఇటు అధికారులు, ఇటు ప్రజలు నడిచి వెళ్లేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఇది ఒక్క రోజుతో కాదు గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్‌కు ప్రతిరోజు వందలాది మంది అధికారులు, సిబ్బంది, ప్రజలు వస్తుంటారు. సాయంత్రం అవ్వగానే వర్షం కురవడంతో మోకాలి లోతను నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని పలువురు కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు వాపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. నిల్వ ఉన్న నీటిని బయటకు తరలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న కలెక్టరేట్ ప్రాంగణం

నానో యూరియాతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - రామభద్రపురం

నానో యూరియా వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అధిక దిగుబడులకు తప్పకుండా ప్రతీ రైతు వాడాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.మధుసూదనరావు తెలిపారు. మండల పరిధిలోని సోంపురంలో మంగళవారం నానో యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమరా శివ, రైతు సేవా కేంద్రం సిబ్బంది వరలక్ష్మీ, పాల్గొన్నారు.

డెంకాడ: వరి పంటకు సంబంధించి యూరియాను రెండు విడతలుగా వేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్‌రావు అన్నారు. మండలంలోని సింగవరంలో మంగళవారం నిర్వహించిన 'యూరియా మీ చెంతకు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రాజారావు, ఎఒ టి.సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారి బి. రామకోటి, రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: యూరియాను మోతాదుకు మించి వాడకూడదని మండల వ్యవసాయ అధికారి రవీంద్ర అన్నారు. మండలంలోని మూల బొడ్డవర గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు యూరియా వాడకం, నానో యూరియా అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, సిబ్బంది బి.భానులత, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ సహాయకులు, సురేష్, పాల్గొన్నారు.



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎఒ

వేపాడ: మండలంలో సోంపురం పంట పొలాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులకు క్వాలిటీ జీవామృతం, కషాయాలను డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎలా పిచికారీ చేయాలో అధికారులు వివరించారు. అనంతరం చింతల అవతారం, చింతల గోవిందా, అప్పారావు పొలాల్లో కషాయాలను పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాము, వెంకట్రావు, సత్యవేణి, హరీష్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఎఒ పి. శ్రీలక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు యామిని, రైతులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని పాత బొబ్బిలి గ్రామంలో మంగళవారం సామూహికంగా 200 లీటర్ల పలు పత్ర ద్రావణం ఎఒ శ్యామ్ సుందర్‌రావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పురిటి శంకర్రావు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎ తనూజ, ఐసిఆర్‌పి గౌరీ, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని టిడిపి నాయకులు దూబ ధర్మారావు, మండల టిడిపి అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, పాలవలస రామచంద్రరావు ఎంపిడిఒ శ్యామల కుమారిని కోరారు. సంకిలి సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ పరిశీలించగా వారంతా తెలుసుకొని అక్కడి చేరుకుని ఎంపిడిఒతో మాట్లాడారు. సంకిలి సచివాలయం పరిధి సంకిలి, అప్పాపురం గ్రామపంచాయతీలకు మరో మూడు గ్రామాలు రైతులకు యూరియా పూర్తిస్థాయిలో అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ వ్యవసాయ అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈసారి యూరియా వస్తే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసి యూరియా పంపిణీకి కృషి చేస్తామని అన్నారు. వీరితోపాటు టిడిపి నాయకులు గంగు కృష్ణ, కర్రి రమణ, నారు జనార్ధన రావు తదితర నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. మంగళవారం పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య విధానాన్ని గమనించారు. తర్వాత సచివాలయ సందర్శన చేపట్టారు. సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్ తనిఖీ చేశారు. వివిధ చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

నీటి పన్నులు వసూలు ముమ్మరం చేయాలి

నగరంలో నీటి పన్ను వసూళ్ళను ముమ్మరం చేయాలని ఎమినిటీస్, అడ్మిన్ కార్యదర్శులకు,ఫిట్టర్లకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సచివాలయాల వారీగా చేపట్టిన నీటి చార్జీల వసూళ్ళపై సమీక్షించారు. లక్ష్యాలు కన్నా దిగువ స్థాయిలో వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. నీటి చార్జీలు వసూలు శతశాతం జరిగే విధంగా కృషి చేయాలని చెప్పారు. నీటి చార్జీలు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నీటి వృధాను అరికట్టే బాధ్యతను కూడా స్వీకరించాలన్నారు. అనంతరం రెవెన్యూ వసూళ్లపై సమీక్షించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డిఇ నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

విజయనగరం టౌన్: ప్రజాసంక్షేమం, పేదల అభ్యున్నతే జనసేన లక్ష్యమని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. 6వ డివిజన్ నుండి 50 కుటుంబాలకు చెందిన వారు మంగళ వారం వైసిపి నుంచి జనసేనలో చేరారు. వీరికి అయ్యలు, యశస్వి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పాలూరి శివ, కోట్ల అప్పలరాజు, పోదులపు సంతోష్, జమ్మూ హరికృష్ణ, పెను మజ్జి కిషోర్ కుమార్, కోట్ల మోహన్, కెల్లా దిలీప్, కిలారి మోహన్, నడిపేన రాజేష్, పాలూరి కిరణ్ కుమార్ తదితరులున్నారు.

మహిళలకు ఎగ్ కార్ట్‌ల పంపిణీ

విజయనగరం కోట: మహిళల ఆర్థిక అభివృద్ధికి డ్వాక్రా మహిళలకు ఉచితంగా ఒక్కొక్కరికి రూ.50వేలు విలువ చేసే రెండు ఎగ్ కార్టులను మహిళా ప్రాంగణంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అందజేశారు. దుప్పాడకు చెందిన బొబ్బాది అంకయ్యమ్మకు, జొన్నవలసకు చెందిన గెద్ద అప్పలకొండమ్మకు వీటిని అందజేశారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, సెర్ప్ ఒప్పందంలో భాగంగా గ్రామీణ ప్రజల పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు, కోడిగుడ్డు వినియోగాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. నాయకులు పాల్గొన్నారు.

నాటు బండి కిందపడి వ్యక్తి మృతి

శృంగవరపు కోట: మండలంలోని వేములపల్లి గ్రామంలో బోడబల్ల సన్యాసి రావు(48) అనే వ్యక్తి ఎద్దుల బండితో ఇసుక తరలిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు మీద పడిపోయాడు. అదే సమయంలో అతని ఎద్దుల బండి అతనిపై నుంచి ఎక్కిపోయింది. అతనిని వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు అతని భార్య బోడబల్ల ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

కోళ్ల ఫారం వ్యర్థాలతో చేపలు మృతి

వేపాడ: మండలంలోని నీలకంఠరాజుపురం గ్రామపంచాయతీ పెద్దగుడిపాల రెవెన్యూ పరిధిలోగల పీసుబంద చెరువులోకి కోళ్ల ఫారం నుంచి వచ్చే వ్యర్థాలు చేరడంతో చెరువులో ఉన్న చేపలు మృతి చెందాయి. చెరువులోని చేపలు పెద్దఎత్తున చనిపోగా, అదే నీరు తాగిన పశువులు అనారోగ్యానికి గురయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా ఈ గుడ్లకోళ్ల ఫారం నడుస్తోందన్నారు. వ్యర్థాలు చెరువులోకి వదిలిపెట్టడం వల్ల పర్యావరణం కాలుష్యం అవుతోందని, ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పు వాటిల్లుతోందని, వెంటనే అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖలు తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి

శృంగవరపు కోట: పట్టణంలోని కోటాన వీధికి చెందిన కోటాన వల్లయ్య(75)అతని అన్న కొడుకు కోటాన నారాయణరావు ఇంటికి భోజనానికి వెళ్లేందుకు రోడ్డుకి పక్కగా నడుచుకుంటూ వెళుండగా వన్‌వే జంక్షన్ వద్దకు చేరుకునే సరికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా, హార్న్ కొట్టకుండా నడుపుతూ వచ్చి వల్లయ్యను ఢీ కొట్టాడు. దీంతో వల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అతని అన్న కొడుకు కోటాన నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్

నగరంలోని వైయస్సార్ నగర్‌కు చెందిన బెవర వెంకటరావు (36) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. వెంకటరావు అప్పులు చేసి తాగుడుకు అలవాటు పడ్డాడు. అప్పులు బాధలు భరించలేక సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుని భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
ప్రత్యేక అనుబంధం
పూసపాటిరేగ మండలం
బుధవారం 10-9-2025 | విజయనగరం జిల్లా | 12 పేజీలు

పర్యాటక మణిహారం.. పూసపాటిరేగ తీరం


చింతపల్లి సముద్ర తీరం

ఓవైపు విశాలమైన తీర ప్రాంతం... మరోవైపు ప్రకృతిని పరవశింపజేసే పచ్చని కొండలు... ఇంకోవైపు ఆరు వరుసల జాతీయ రహదారి... బహుళ ఉత్పత్తులకు నెలవైన పరిశ్రమలు... వీటి నడుమ ఆధ్యాత్మికతను పెంపొందించే పురాతన దేవాలయాలు... పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు పూసపాటిరేగ సొంతం. ఇలా అనేక వనరులు ఉన్న ఈ మండలం వాటిని వినియోగించుకుంటే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పాలకులు ఆ దిశగా దృష్టి పెడితే జిల్లాలోనే అభివృద్ధి పథంలో పూసపాటిరేగ మండలం ముందు వరుసలో ఉంటుందనడంలో సందేహం లేదు.


– ప్రజాశక్తి, పూసపాటిరేగ

పూర్తి కథనం 2లో

అభివృద్ధిపై దృష్టిపెడితే విస్తృత అవకాశాలు


గోవిందపురం ఆలయం


తీరంలో ఆహ్లాదకరంగా కొబ్బరితోటలు





పర్యాటక మణిహారం.. పూసపాటిరేగ తీరం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఒకప్పుడు ఈ ప్రాంతమంతా విజయనగర గజపతుల పాలనలో ఉండేది. కాలక్రమేణా వచ్చిన మార్పుల్లో విశాఖపట్నం జిల్లాలోకి వెళ్లింది. విజయనగరం జిల్లా ఏర్పడిన తర్వాత ఇందులో అంతర్లీనమైంది. 1985 మేలో మండల వ్యవస్థ రావడంతో పూసపాటిరేగ మండల కేంద్రంగా ఆవిర్భవించింది. మండలంలో ప్రస్తుతం 27 పంచాయతీలు, 36 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలతోపాటు, 20 ఎంపిటిసి స్థానాలు, 27 పంచాయతీలు ఉన్నాయి. 14 కిలో మీటర్ల సువిశాలమైన సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 14 మత్స్యకార గ్రామాలుఉన్నాయి. నాతవలస బ్రిడ్జి నుంచి కందివలస బ్రిడ్జి వరకూ 14 కిలో మీటర్ల జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఎటు చూసినా ప్రకృతి అందాలతో పరవశింపజేసే ఈ మండలం పలు సమస్యలతో సతమతమవుతూ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని సమస్యలతో అనునిత్యం పోరాడుతూనే జీవనం కొనసాగిస్తున్నారు.

కాలుష్యంతో సతమతం

పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న కాలుష్యంతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మైలాన్, సిపి ఆక్వా, ఎస్‌ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో మైలాన్, ఎస్‌ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్ పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్యం వల్ల పలు గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. చెరువులు , పంట పొలాలు నాశనమవుతున్నాయి. కందివలస, కనిమెళ్ల, కామవరం, అల్లాడపాలెం, చోడమ్మ అగ్రహారం, జి.చోడవరం గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం ప్రజలు కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు, శ్వాస కోస వ్యాధులతో బాధపడుతున్నారు. కాలుష్య నియంత్రాణాధికారులకు ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రయోజనం లేదు. దీంతో కాలుష్యం బాధపడలేక కొంత మంది ఉన్న ఊరును వదిలివెళ్లిపోతున్నారు. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి.

కలగానే మిగిలిన ఇఎస్‌ఐ ఆసుపత్రి

మండలంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సంఘటిత, ఆసంఘటిత రంగ కార్మికులు సుమారుగా పది వేల మంది ఉన్నారు. పరిశ్రమల్లో వెదజల్లుతున్న కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారినపడుతున్నారు. ఇఎస్‌ఐ ఆసుపత్రి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న చిన్న రోగాలకు కూడా వేలాది రూపాయలు ప్రవేటు డాక్టర్లకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇఎస్‌ఐ ఆసుపత్రి పెట్టాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నిసార్లు వినతులిచ్చినా ఫలితం లేదు.

కలుషితమైన భూగర్భజలాలు

మండలంలోని ఏ గ్రామంలో చూసినా భూగర్భ జలాలు కలుషితమైపోయాయి. అల్లాడపాలెం, కందివలస, కనిమెట్ట, కనిమెల్ల, జి.చోడవరం, చోడమ్మ అగ్రహారం, కొవ్వాడ తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పరిశీలనలో తేలింది. మిగతా గ్రామాల్లో బోర్లు, నేల బావిల్లో నీటిని తాగితే ఫ్లోరెడ్ కంటెంట్ వల్ల కీళ్ల నొప్పులతో, నడుం నొప్పులతో ప్రజలు సతమతమవుతున్నారు. మండలంలో ఫ్లోరెడ్ కంటెంట్ ఎక్కువగా ఉండడంవల్ల మండలానికి రూ.10కోట్లుతో పైలెట్ ప్రాజెక్టు నిర్మించారు. చంపావతి నది నుంచి నేరుగా తాగునీరు గ్రామాలకు సరఫరా చేయడానికి ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మించారు. నది నుంచి నీరు సరఫరా అవుతున్న పైపులు సరిగ్గా లేకపోవడంతో గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొరగా నీరు సరఫరా అవుతుంది. ఆ నీరు గ్రామస్తులకు చాలక స్థానిక బోర్లులో నీటిని ట్యాంకులకు పంచాయతీ సిబ్బంది ఎక్కిస్తున్నారు. దీంతో మళ్లీ ఫ్లోరెడ్ నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు

మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు వెళ్లడానికి ఇదే రహదారి. దీంతో అనునిత్యం వేలాది మంది ప్రయాణీకులు మండల కేంద్రం జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి చూస్తారు. ప్రయాణీకులు వేచి ఉండడానికి నిలువ నీడ లేదు. దీంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మండలంలో నాతవలస జంక్షన్ నుంచి అల్లాడపాలెం జంక్షన్ వరకూ సుమారుగా 10కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. దీంతో అను నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. క్షతగాత్రలకు సకాలంలో వైద్యమందక తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. జాతీయ రహదారిని ఆనుకొని ట్రామాకేర్ సెంటర్ పెడతామని అధికార్లు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. జాతీయ రహదారి ఆనుకొని ఉండడంతో ఇక్కడ ట్రమాకేర్ సెంటర్ అవసరం ఎంతయినా ఉంది.

రామతీర్థ సాగర్ పూర్తిచేయాలి

మండలంలోని భూములు వర్షాదాధారంపైనే ఆధారపడి పంటలు పండుతాయి. దీంతో మండలంలోని కుమిలిలో 2007లో రామతీర్థ సాగర్ నిర్మాణం చేపట్టారు. ఆ ప్రాజెక్టు నిర్మాణమైతే మండలంలో సుమారుగా వెయ్యి హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కలుగుతుంది. కానీ ఏళ్లు గడుస్తున్నా కుమిలిలో చేపట్టిన బండ నిర్మాణమే ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. దీంతో రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పట్లో పూర్తవుతుందన్న నమ్మకం కూడా రైతన్నలకు లేదు. ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుంది.

పట్టాల కోసం ఎదురు చూపు

మండలంలోని కొళ్లాయివలస, చినబత్తివలస, పెదబత్తివలసలో గిరిజనులు, దళితులు ప్రభుత్వ భూములను ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. సాగు చేస్తున్న భూములు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏడో విడత భూపంపిణీలో పట్టాలిస్తారని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం మండలం ఉడా పరిధిలో ఉండడం వల్ల భూ పంపిణీకి బ్రేకులు పడ్డాయి. ఇకపై మండలంలో భూ పంపిణీ ఉండదన్నది అధికార్లు చెబుతున్నారు.

జట్టీ ఏర్పాటు చేయాలి

మండలంలో సుమారుగా 10 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 4 వేల మంది మత్స్యకారులు వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తీరంలో జట్టీలు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జట్టీ లేకపోవడంతో నిత్యం వేటకు వెళ్లే ముందు పడవలను సముద్రంలోకి తీసుకెళ్లేందుకు తీవ్రంగా కష్టపడాల్సి వస్తుంది. జట్టీ లేకపోవడంతో కొంతమంది పడవలను సముద్రంలోనే లంగరు వేసి వదిలేస్తున్నారు. తుపాన్ల సమయంలో ఈ బోట్లు కొట్టుకు పోతున్నాయి. జట్టీ ఉంటే బోట్లును తీరం ఒడ్డుకు తెచ్చి జట్టీకు కట్టుకునే అవకాశం ఉంటుంది. జట్టీ నిర్మాణానికి మత్స్యకారులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు.

నెరవేరిన కల

మండలంలోని సుమారుగా 60 గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నేటికీ వందలాది తాటాకు ఇళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురవుతున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో విజయనగరం, రణస్థలం నుంచి అగ్ని మాపక దళం వచ్చే వరకూ వేచి చూడడంతో ఇళ్లు కాలిబూడిదవుతున్నాయి. ఈనేపథ్యంలో ఏ నాటి నుంచో పాలకులు ఇస్తున్న హామీ ఎట్టకేలకు నెరవేరింది. ఇటీవలే ఎమ్మెల్యే లోకం మాధవి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పనులు సాగుతున్నాయి.

ప్రజలతో ప్రజాశక్తి

ప్రజాశక్తి-విజయనగరం

'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రజాశక్తి దినపత్రిక 45వ వసంతంలోకి ప్రవేశించింది. 1981 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి దినపత్రికగా వెలువడింది. 1980వ దశకంలో తెలుగునాట సాగిన అఖిలపక్ష రైతు ఉద్యమం, తదనంతరం ఎగసిన కాంగ్రెస్ వ్యతిరేక వెల్లువకు ఆలంబనగా నిలిచింది. 90వ దశకంలో దేశవ్యాప్తంగా వచ్చిన నయా ఉదారవాద విధానాలు, వాటితోపాటే రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని, రానున్న ప్రమాదాల గురించి వివరించింది. వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షకులకు, విస్తార ప్రజా సమూహాలకు మద్దతుగా నిలిచింది. 2000 దశకంలో పాలకులు బషీర్‌బాగ్‌లో, ముదిగొండలో తూటాల వర్షం కురిపించి నిండు ప్రాణాలను బలిగొన్నా, ఆ ఉద్యమాలన్నింటిలోనూ ప్రచారాందోళన సాధనంగా ప్రజాశక్తి తనవంతు పాత్ర పోషించింది.

దేశంలో నయా ఉదారవాద విధానాలకు తోడు మతతత్వ శక్తులూ పెరిగాయి. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేష సృష్టికి మతోన్మాదులు అయోధ్య మొదలు వారణాసి, మధుర వరకు అనేక వివాదాలను లేవనెత్తి రావణకాష్టాన్ని రగిలిస్తున్నారు. కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో ప్రజాస్వామ్యం, స్వావలంబన, లౌకికతత్వం, సామాజిక న్యాయం హరించి వేయబడుతున్నాయి. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడింది. నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. అటవీ హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, దేశానికి తీవ్ర హాని కలిగించే పరిణామాలన్నింటిపైనా పాఠకులకు ముందస్తు సమాచారాన్ని అందించడంలో ప్రజాశక్తి ముందుంది. దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు, ప్రజల ఐక్యతను కాపాడడం కోసం అన్ని సందర్భాల్లోనూ నికరంగా నిలిచింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయరాదన్న సూత్రబద్ధ వైఖరికి కట్టుబడిన ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ విభజనను వ్యతిరేకించి సమైక్యత కోసం నిలబడింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్... ఇలా ఎన్నో హామీలిచ్చినా అవి నీటి మీద రాతలుగా మారాయి. ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర పాలకులను దోషులుగా నిలపడంలోనూ, రాష్ట్రంలోని పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టే విషయంలోనూ ప్రజాశక్తి ముక్కుసూటిగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది 1999లో గానీ, 2025లో గానీ పాలకుల విధానాలను, సంస్కరణల పేరిట సాగుతున్న దోపిడీని, విద్యుత్ భారాలను ప్రతిఘటించడానికి జనానికి సమాచారాన్ని ఇవ్వడంలో ముందుంది. తరగతుల విలీనం పేరిట విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వాటి పర్యవసానాలను ప్రజల ముందుంచింది. తమ హక్కుల సాధనకు ఉద్యమించే ఉద్యోగ, ఉపాధ్యాయులు, చిరువ్యాపారులు, మహిళలు, విద్యార్థి, యువజనలకు బాసటగా నిలుస్తోంది.

మహనీయుల త్యాగాలతో, ప్రజల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి కార్పొరేట్, మతతత్వ శక్తుల మూలంగా ముప్పు ఏర్పడింది. మహత్తర స్వాతంత్ర్య పోరాటంలోనూ ప్రజాశక్తి పాలుపంచుకుంది. 1942లోనే పత్రిక ప్రారంభమైనా పాలకులు నిషేధం విధించడంతో నిలిచిపోయింది. తిరిగి 1968లో వారపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటో తేదీ నుంచి దినపత్రికగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ఎనిమిది కేంద్రాల నుంచి వెలువడుతోంది.

భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో పత్రిక స్థాపన, వ్యవస్థాపక సంపాదకునిగా మోటూరు హనుమంతరావు వేసిన పునాది, పత్రికను విస్తరింప జేయడంలో ఎనలేని కృషి సల్పిన కొరటాల సత్యనారాయణ వంటి మహామహులు, వారి సహచరులు చూపిన మహత్తర మార్గంలోనే ప్రజాశక్తి నడుస్తోంది. పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషుల విశేష ఆదరణ వల్లనే కోవిడ్ విపత్తుతో సహా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ఈ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. ముమ్ముందు ఇంతకన్నా మిన్నగా ఆదరించి, ఆశీర్వదించాలని మనవి చేస్తున్నాం.




ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం

భోగాపురం (అల్లూరి సీతారామరాజు) గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 జూన్ నాటికి విమాన సర్వీసులు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందుకనుగుణంగా వివిధ రాకాల పనులు చకచకా ముందుకు సాగుతున్నాయి. విమానాశ్రయం చుట్టూ స్టార్ హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటు కానున్నాయి. ఇందుకనుగుణంగా ప్రభుత్వం భూములు, సదుపాయాల కల్పనకు కూడా ముందుకు వచ్చింది. ఈనేపథ్యంలో భోగాపురం పరిసర ప్రాంతం భూతల స్వర్గంగా మారనుంది.


ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు (ఫైల్)

ఉత్తరాంధ్రకు మణిహారం

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- పరిసర ప్రాంతాల్లో భారీ టూరిజం ప్రాజెక్టులు
- జాతీయ రహదారిని కలుపుతూ పలు రహదారులు
- వచ్చే జూన్ నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా 2015లోనే భోగాపురం విమనాశ్రయానికి నాందిపలికారు. సుమారు 15వేల ఎకరాలకు సేకరించేందుకు అప్పటి ప్రభుత్వం సిద్ధపడగా, రైతుల తరపున సిపిఎం నిలవడంతో క్రమంగా 2,500 ఎకరాలకు తగ్గింది. ఎయిర్‌పోర్టు కోసం రైతులు పుట్టిపెరిగిన ఊళ్లు, తాత తండ్రుల నుంచి సంక్రమించిన భూములు త్యాగం చేసిన సంగతి తెలిసిందే. సిపిఎం పోరాటంతో నిర్వాసితులకు న్యాయం మెరుగైన ప్యాకేజీ కూడా వచ్చింది. అప్పటికీ కొంతమంది న్యాయ స్థానాలను ఆశ్రయించడంతో ప్రభుత్వం చొరవ చూపి కేసులు ఉపసంహరించుకునేలా చేసింది. దాదాపు కేసులన్నీ క్లియర్ కావడంతో సుమారు 2వేల ఎకరాల్లో జిఎంఆర్ పనులు చేపట్టింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో చేపట్టాల్సిన పనుల్లో 74శాతం పూర్తియినట్టు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇప్పటికే రన్‌వే, టెర్మిన్, మట్టి పనులు పూర్తయ్యాయి. టాక్సీవే, ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు సమాచారం. మరో ఆరునెలల లోపే మిగులు పనులు పూర్తిచేసి, ట్రైల్‌రన్ కూడా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈలెక్కన 2026 జూన్ నాటికి విమానాలు నడిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విమానాశ్రయ నిర్మాణ పనులు చేపట్టిన జిఎంఆర్ సంస్థ ఇటీవల కాలంలో పూర్తిగా రంగంలోకి దిగింది. జాతీయరహదారిపై ప్రయాణించే వాహనాలకు ఇబ్బంది లేకుండా అనుసంధాన రహదారిని కలిపేందుకు '8' ఆకారంలో ట్రంపెట్ నిర్మిస్తున్నారు. ఇందుకోసం అదనంగా 25 ఎకరాలు సేకరించారు.


ఎయిర్‌పోర్టు రన్‌వే

ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా 23రహదారులు

భోగాపురం నుంచి విశాఖవైపు ఎక్కువ ట్రాఫిక్ ఉండే అవకాశాలు ఉన్నందున ఆ నగరాన్ని కలిపే రహదారులను అనకాపల్లి, ఆనందపురం రహదారికి అనుసంధానం చేసేదిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా 23రోడ్లను గుర్తించారు. వీటిలో 18రహదారులు తొలిదశలోనే చేపట్టాలన్నది ప్రభుత్వ ఆలోచన. వీటిలో 11వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు ఉన్నాయి. మిగిలిన ఏడు ఇప్పటికే ఉన్నాయి. వీటిని పొడిగించడం, విస్తరించడం వంటివి చేస్తారు. ఇందుకోసం రూ.500కోట్ల బడ్జెట్ అవసరం కానున్నట్టుగా అంచనాలు కూడా రూపొందించారు. మన జిల్లాలో అయినాడ జాతీయ రహదారి కూడలి, బొడ్డవలస నుంచి విజయనగరం రింగురోడ్డు వరకు 9రోడ్లను 24మీటర్లకు మీటర్ల వరకు రహదారులు రానున్నాయి. ఎయిర్‌పోర్టు చుట్టూ అధునాతన ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. జిల్లాలో కోస్టల్ కారిడారు ఇప్పటికే సర్వే పూర్తిచేసినట్లు సమాచారం.

స్టార్ హోటళ్లు, రిసార్ట్స్‌కూ పెద్దపీట

పర్యాటకాభివృద్ధి పేరిట హోటళ్లు, రిసార్ట్స్, కన్వెక్షన్ హాల్స్ తదితరాల ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వం తరపున స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అడుగులు వేస్తోంది. ఇప్పటికికే ఎయిర్‌పోర్టుకు ఆనుకునివున్న కంచేరు రెవెన్యూ పరిధి 227/1లో 3.10ఎకరాలను 'సన్ రే, అవని' సంస్థలకు కేటాయిస్తూ ప్రభుత్వానికి అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ఎయిర్ పోర్టుకు మరో వైపున ఉన్న భీమిలి పరిధిలోని అన్నవరం సముద్ర తీరంలో మే ఫెయిర్, ఒబెరాయ్ గ్రూపులకు చెందిన హోటళ్లకు అప్పటికే స్థలాలు కేటాయించారు.

ప్రభుత్వం చెప్పిందంతా బూటకమే

ఎంపిపి మహంతి కల్యాణి

ప్రజాశక్తి -పూసపాటిరేగ



ఎన్నికల ముందు ప్రతి ఇంటికి సంక్షేమం, పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందనే మాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం చెప్పిందంతా బూటకమేననితేలిపోయిందని పూసపాటిరేగ ఎంపిపి మహంతి కల్యాణి అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

'ప్రజలకు అనుకూల పాలన అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రజల సంక్షేమం కోసం ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. పేదలకు, బడుగుబలహీన వర్గాలకు, రైతులకు, మహిళలకు, విద్యార్థులకుతోపాటు అన్నివర్గాల ప్రజలకు సమానంగా చేరాల్సిన పథకాలు అరకొరగా అందడంతో సంబందిత వర్గాలు ఆందోళన చెందుతున్నారు. నిజమైన అర్హులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతున్నారు. తల్లికి వందనం ఇస్తామనిచెప్పి అనేక మంది తల్లులకు వందనం పాడేశారు. ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా కనీసం పింఛన్లు ఇవ్వలేకపోయారు. జగనన్న ఇచ్చిన పింఛన్లు తీసేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఇదేనా మీ పాలనా, సంక్షేమం? ఎరువులు లేక రైతులు మొర్రోమంటూ ఏడుస్తున్నారు. కనీసం అన్నం పెట్టే రైతును పట్టించుకోలేని ప్రభుత్వం ఇది. అరకొరగా అన్నదాత సుఖీభవ నిధులు ఇచ్చి, అరకొర ఎరువులుతో సాగించేయాలను కుంటున్నారు. ఆడపిల్ల నిధిఇ ఏదీ అంటూ ప్రజలు నాయకులును నిలదీస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, కేవలం అధికారంలో నిలబడేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వంపై గ్రామీణ స్థాయిలో ఆగ్రహం పెరుగుతోంది. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీలు, విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్, మహిళలు సబ్సిడీ పథకాలు ఇవన్నీ ఆలస్యం అవుతుండటంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది వైసిపియే. ప్రజా సమస్యలపై మేము ప్రజల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటాం. కూటమి చేస్తున్న అన్యాయంపై ప్రజలు త్వరలోనే గట్టి తీర్పు ఇస్తారు.

ప్రభుత్వాలు, పాలకులు మారినా గంగపుత్రుల బతుకులు మాత్రం మారడం లేదు. సముద్రమే ఆధారంగా బతుకుతున్న మత్స్యకారులకు జీవనోపాధి కరువవుతోంది. ప్రాణాలను ఫణంగా పెట్టి వేటకు వెళ్లినా అందుకు తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 27 కిలోమీటర్ల మేర విస్తరించి తీరం ఉంది. ఈ తీరం వెంబడి 19 మత్సకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 25 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సుమారు 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేటపై ఆధారపడి జీవిస్తున్నారు.

- ప్రజాశక్తి, పూసపాటిరేగ



సముద్రంలో వేటకెళ్లి తిరిగొస్తున్న మత్స్యకారులు

కష్టాల కడలిలో మత్స్యకారులు

చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టి నిర్మాణ పనులు ప్రారంభించాలి. దీంతో మత్స్యకారుల సమస్యలు సగం తీరినట్లు అవుతుంది. వలసలు నివారణ జరుగుతుంది. తరచూ సముద్రంలో వేటకు వెళ్లే ముందు జరిగే ప్రమాదాలను నివారించవచ్చు. సముద్రం ఆటు పోట్లకు మత్స్యకారులు దొరకకుండా సురక్షితంగా తమ ఆస్తులను కాపాడుకోవచ్చు. ఫ్లోటింగ్ జెట్టి నిర్మాణం పై ప్రత్యేక దృష్టి పెడితే మత్స్యకారులకు మంచి రోజులు వచ్చినట్లే

చేపల గుర్తింపు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

ఒకప్పుడు వేటకు వెళ్తే వలలు పిగిలేటంత మత్స్య సంపద దొరికేది. కానీ ప్రస్తుతం తీరంలో ఉన్న రసాయనిక పరిశ్రమల వ్యర్థాలతో చేపల వేట కష్టంగా మారింది. పొద్దస్తమానం వేటాడినా పూట గడవడం కష్టంగా మారింది.

ప్లాట్‌ఫాం వెంటనే అందుబాటులోకి తేవాలి..

కష్టపడి వేటాడి తెచ్చుకున్న మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తీరంలో ఇసుకలో ఆరబెడు తున్నారు. దాంతో చేపలకు ఇసుక అంటుకుని నాణ్యత కోల్పోతున్నాయి. నెత్తళ్లు, రొయ్యలు లాంటి విలువైన మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తడిగానే దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. తీర గ్రామాల్లో వెంటనే ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసి మత్స్యకారులను నష్టాల బారి నుండి ఆదుకోవాల్సిఉంది.

దళారులతో తీవ్ర నష్టం

ప్రాణాలకు తెగించి వేటాడి తెచ్చిన వేలాది రూపాయలు మత్స్య సంపద దళారులు పాలవుతుంది. మార్కెట్లో కిలో రూ.200 ఉన్న చేపలు దళారులకు రూ.150కి ఇవ్వాల్సిందే. ఎందుకుంటే దళారులు, మత్స్యకారులకు వేటలేని సమయంలో రూ.10 వేలు నుండి రూ. 20 వేలు దాకా అప్పుగా ఇస్తారు. దానికి బదులుగా వేటాడి తెచ్చిన సరుకును వారికే ఇవ్వాలనే నిబంధన పెడతారు. లేక పోతే కుల కట్టుబాట్ల ప్రకారం జరిమానా విదిస్తారు. దాంతో విలువైన సంపదను తక్కువ ధరకు ఇచ్చి నష్టపోతున్నారు.

ఐస్ పెట్టెలు పంపిణీ చేయాలి

వేటాడి తెచ్చిన మత్స్య సంపదను నిల్వ ఉంచేందుకు ఐస్ బాక్సులు లేకపోవడంతో చేపలు నాణ్యత కోల్పోతున్నాయి. ఐస్ బాక్సులు ఉంటే చేపలు కొన్ని రోజుల వరకూ పాడవకుండా ఉంటాయి. మత్స్య శాఖ పంపిణీ చేస్తున్న ఐస్ బాక్సులు నాణ్యత లేకపోవడంతో (మిగతా..6లో)

కష్టాల కడలిలో మత్స్యకారులు

(5వ పేజీ తరువాయి)

చేపలు పాడైపోతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. వారికి నాణ్యతగల ఐస్ బాక్స్‌లు పంపిణీ చేయాల్సిఉంది.

తుపాను షెల్టర్లు వినియోగంలోకి తేవాలి

ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు మత్స్యకారులను సురక్షితంగా ఉంచాలన్న ఉద్ధేశంతో ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల్లో తుపాను భవనాల నిర్మాణం చేపట్టింది. రెండు మండలాల్లో సుమారుగా 24 తుపాను భవనాలను నిర్మించారు. కొన్నేళ్లగా పరిరక్షణ లేక కొన్ని శిథిలావస్థలో కొట్టుమిట్టాడగా మరికొన్ని నేలమట్ట మయ్యాయి. అధికారులు స్పందించి తుపాను భవనాలను వినియోగంలోకి తేవాలి.


వలను సిద్ధం చేస్తున్న మత్స్యకారుడు

తాగునీరు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మత్స్యకార గ్రామాల్లో ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది. చింతపల్లి, పెద్దూరు, కొత్తూరు, కోనాడ, తిప్పలవలస, ముక్కాం, కొండరాజపాలెం తదితర గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొర నీరు రావడంతో తాగునీటికి చేతిబోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. క్లోరినేషన్ లేక తాగునీరు కలుషితం కావడంతో తరచూ మత్స్యకారులు రోగాలు బారిన పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్యం మెరుగు పర్చాల్సిఉంది.

రసాయనిక వ్యర్థాలను నివారించాలి

పదేళ్లగా తీరం వెంబడి పదుల సంఖ్యలో మైలాన్, హెచ్‌బిఎల్, వేదా, అరబిందో, రెడ్డీస్, ఎఐఎల్, సరాకా తదితర రసాయనిక పరిశ్రమలు వెలిశాయి. వీటి నుండి వస్తున్న వ్యర్థ జలాలన్నీ సముద్రంలోకి పైపు లైన్ల ద్వారా విడుదల చేస్తున్నారు. దాంతో ఈ తీరమంతా వ్యర్థ జలాలతో కాలుష్యమైపోయింది. సుమారుగా తీరానికి 5 కిలోమీటర్లు సముద్రం లోపల వరకూ చేపలు జాడ కానరావడం లేదు. దాంతో వేటకు వెళ్లినప్పటికీ చేపలు వలల్లో పడడం లేదు. అది రానురానూ తీవ్రంగా పరిగణించింది. ప్రస్తుతం సాంప్రదాయంగా వస్తున్న కుల వృత్తిని వదల్లేక, భార్యా, పిల్లలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మత్స్యకార సొసైటీలను పునరుద్ధరించాలి

నిర్వీర్యమైపోయిన మత్స్యకార సొసైటీలను ప్రభుత్వం పునరిద్ధరించాల్సి ఉంది. గతంలో రెండు మండలాల్లో సుమారుగా 7 మత్స్యకార సొసైటీలు ఉండేవి. ప్రస్తుతం అవి మరుగున పడిపోయాయి. మత్స్యశాఖాధికారులు కూడా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోపోవడంతో సొసైటీల ద్వారా గంగపుత్రులకు రావాల్సిన రుణాలు రావడం లేదు. ఆ శాఖ అధికారులు స్పందించి సొసైటీలను పునరుద్ధరించాలి.

తీరంలో డీజిల్ బంక్ ఏర్పాటుచేయాలి

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారుగా 442 మర బోట్లు ఉన్నాయి. ఒకొక్కరూ రోజుకు సుమారుగా 10 నుండి 20 లీటర్ల వరకూ డీజిల్ వినియోగిస్తారు. వేట నిమిత్తం వీరంతా రోజుకు సుమారుగా 3 వేల లీటర్లు డీజిల్‌ను వినియోగిస్తారు. తీరంలో డీజిల్ బంకు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలపై 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న బంకులకు వెళ్లి ప్రతిరోజు డీజిల్ తెచ్చుకుంటారు. కొంతమంది గ్రామంలో అమ్ముతున్న కల్తీ డీజిల్‌ను కొనుక్కుంటున్నారు. దాంతో ఇంజన్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దళారుల దగ్గర డీజిల్ కొనడంతో బిల్లులు లేక సబ్సిడీకి కూడా దూరమవుతున్నారు. అధికారులు స్పందించి తీరంలో డీజిల్ బంకు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నియోజకవర్గానికి పూర్వ వైభవం



మన నియోజకవర్గానికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వంలో చెప్పిన ప్రతి పథకం ఇస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయి. అభివృద్ధి సంక్షేమం రెండూ రెండు కళ్లుగా ఉంటాయి. అన్న ఎన్‌టిఆర్ సమయం నుండి ఈ పార్టీకి మన ప్రాంతంలో అపూర్వ వైభవం ఉంది. దాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరింత పటిష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే పతివాడ సారధ్యంలో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉండేది. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పేరుతో గ్రామాల్లో తిరిగాం. చెప్పిన పథకాలన్నీ ఒక్కొక్కటిగా అందిస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేయడం ఈ ప్రభుత్వ విధానం. మన ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ ఈ ప్రాంత రూపురేఖలనే మార్చేయబోతుంది. దశాబ్దాల నాటి పతివాడ కల అగ్ని మాపక కేంద్రం నిర్మాణం చేయడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతం రైతులకు కావాల్సిన రామతీర్థ సాగర్ పనులు పూర్తి అయితే రైతుకు ఆర్థిక భరోసా దొరుకుతుంది. తోటపల్లి కాలువ నీరు మరికొన్ని ప్రాంతాలకు వెలితే చాలా ఉపయోగంగా ఉంటుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, గ్యాస్ బండలు లాంటి పథకాలు అందించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్టయ్యింది. మళ్లీ అభివృద్ధి గాడిలో పడుతుంది. ఈ ప్రాంతం గాని, రాష్ట్రం గాని అభివృద్ధి టిడిపితోనే సాధ్యం. విజనరీ లీడర్ చంద్రబాబు. ఆయనకు తోడుగా మిగతా సహచరులు అన్ని విదాలా ముందుకు తీసుకువెళతారు.

- మహంతి శంకర్రావు, టిడిపి మండల అధ్యక్షులు, పూసపాటిరేగ

రైతులకు తీరని ద్రోహం



జెడ్‌పిటిసి సభ్యులు మహంతి సీతాలక్ష్మి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కూటమి ప్రభుత్వం రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందని జెడ్‌పిటిసి సభ్యులు మహంతి సీతాలక్ష్మి అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అన్నదాత సుఖీభవ నిధులు రైతులందరికీ అందలేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 6 వేల మంది రైతులు ఉంటే కేవలం 9 వేల మందికి మాత్రమే ఈ నిధులు జమయ్యాయి. మిగతా రైతులకు ఏదో సాకు చూపి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఇదేనే రైతు సంక్షేమం అంటే? సూపర్ సిక్స్ అంటూ ప్రచారం ఊదరగొట్టడమే తప్పా అంతా అరకొరే. తల్లికి వందనం పేరుతో ఎంతో మంది తల్లులను మోసం చేసారు. సాంకేతిక సమస్య పేరుతో ఆ పథకానికి ఎంతో మంది తల్లులును దూరం చేసారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్దంగా ఉన్నారు. భర్త చనిపోయిన మహిళలకు పింఛను ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. జగనన్న ఇచ్చిన పింఛన్లను తీసేసే పనిలో ఉన్నారు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజా వంచన జరుగుతోంది. గద్దెనెక్కడమే లక్ష్యంగా హామీలు ఇచ్చారు. నమ్మి మోసపోయారన్న సంగతి ప్రజలు గ్రహిస్తున్నారు.

ఇది ప్రజా వంచన



ప్రజాశక్తి- పూసపాటిరేగ

అనతి కాలంలోనే కూటమి ప్రభత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించారు. అందుకే గ్రామాల్లో ఇదేమి ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఈ రోజున ఎక్కడ చూసినా సంక్షేమం లేక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు, మహిళల ఆవేదన వర్ణణాతీతం. వితంతువులకు కనీసం పింఛన్ ఇవ్వకపోవడం సిగ్గు సిగ్గు. కూటిమి నాయకులు ప్రజల్లో తిరగలేకపోవడం మనం గమనిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలంటే కూటమి నాయకులు భయాందోళ చెందుతున్నారు. ఎందు కంటే ఎక్కడకి వెల్లినా ప్రభుత్వం ఇస్తామన్న సంక్షేమం ఏదీ అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అందుకే ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పక తప్పదు. ఈ రాష్టంలో మరలా జగనన్న ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి , సంక్షేమం సాధ్యం. రైతులు సమస్యలు చెప్పనవసరం లేదు. యువతకు ఏదీ కూటమి భరోసా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆడబిడ్డ నిధి ఎలాగు రాదని ప్రజలకు అర్థమైంది. 50 సంవత్సరాలకు పింఛన్ వస్తుందని ఆశ ఎలాగులేదు. మోస పూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కేసారు. ఇది ప్రజా వంచన. ఈ ప్రభత్వానికి బుద్ధి చెప్పే రోజులు వచ్చేసాయి.

- అల్లాడ సత్యనారాయణమూర్తి, వైస్ ఎంపిపి, పూసపాటిరేగ



నాటి కుంబిలాపురమే నేటి కుమిలి

ఎటు చూసినా కోట... చుట్టూ మోహరించిన సైనికులు...అడుగడుగునా యుద్ధ వీరుల విన్యాసాలు...ఓ పక్క నుండి గుర్రపు డెక్కల చప్పళ్లతో పరుగులు తీసే రధాలు...మరోపక్క నుండి గజరాజుల ఘీంకారాలు...ఇవన్నీ బాహుబలి సినిమాలో రాజమౌళి చూపించిన సీన్లు అనుకుంటే పొరపాటే. మండలంలోని కుమిలి గ్రామంలో పూర్వం జరిగిన యదార్థ గాధ. విజయనగర మహారాజుల సామ్రాజ్యం ఇక్కడ నుండే ప్రారంభమైంది. కుమిలి గ్రామాన్ని రాజధానిగా చేసుకొని ఇక్కడ నుండే పరిపాలన జరిగిందనడానికి సాక్ష్యాలు ఇక్కడ ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో మహారాజులు నిర్మించిన మట్టి కోట శిథిలమై మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. నేడు కుమిలిగా నామకరణంతో పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురం అనే నామకరణంతో విరజిల్లేది. కాలక్రమేన ఈ కుంబిలాపురంలో మట్టి కోట కుమిలిపోవడంతో ఈ గ్రామానికి కుమిలి అనే పేరు వచ్చింది. అప్పటి నుండి కుంబిలాపురానికి బదులుగా కుమిలి అనే పేరు మిగిలిపోయింది.

ప్రజాశక్తి-పూసపాటిరేగ

నేడు కుమిలిగా పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురంగా వెలుగొందిందింది. మన విజయనగర గజపతుల పూర్వీకుల నివాసానికి ఆశ్రయమైంది. ఈ గ్రామంలో ఉత్తరాన ఉన్న పెద్ద చెరువు సమీపంలో విజయనగరం గజపతుల పూర్వీకులైన పెదజగన్నాదరాజు తనయుడు కృష్ణమరాజు పరిపాలనా సౌలభ్యం కోసం కుమిలిలో మట్టి కోటను నిర్మాణం చేయించినట్లు చరిత్ర చెబుతుంది.

కళింగ రాజ్యంలో అంతర్భాగంగా ఉండే కుమిలి కోటనే రాజధానిగా చేసుకొని ప్రజాపరిపాలనా కార్యకలాపాలు సాగించేవారు. ఈ కుంబిలాపురం సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు వేదికగా బాసిల్లింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందనడానికి కారణం ఈ గ్రామంలో ఉన్న మసీదులే. మహారాజులు పాలనలో ఈ ప్రాంతంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉండేవారని ఇక్కడ వృద్ధులు చెబుతున్నారు. ఈ కుంబిలాపురంలో ముస్లిమ్‌ల కోసం ఉర్దూ పాఠశాల ఉండేదంటే మహారాజుల పాలనలో మత సామరస్యానికి ఇచ్చిన ప్రాధాన్యతేంటో మనకు అర్థమవుతుంది. విజయనగర గజపతులు మత సామరస్యాన్ని ఇప్పటికి కొనసాగిస్తున్నారంటే అది వారి పూర్వీకుల నుండి పునికి పుచ్చుకున్నదనే తెలుస్తుంది. ఇంత చరిత్ర ఉన్న ఈ కుమిలి గ్రామం జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత గల గ్రామాల్లో ముందు వరసలో ఉంచాల్సిందే. ఈ ప్రాంతంలో ప్రజలంతా కుమిలి సంస్థానీసులకు కప్పం చెల్లించేవారు. కొంతకాలం తరువాత అన్నమరాజుకు పసుపు కుంకమ క్రింద ఈ గ్రామాన్ని మహారాజు ఇచ్చివేసినట్లు చరిత్ర పుటలు చెబుతున్నాయి. అన్నమరాజు వంశానికి సంబంధించిన ఆనందరాజు కుమిలి ప్రభువుగా నియమితులయ్యారు. ఆయన గొప్ప యుద్ధ వీరునిగా వెలుగొందినట్లు తెలుస్తుంది. ఈయన బహుల సైన్యాన్ని సమకూర్చుకొని రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. 1712లో పది వేల మంది సైనికులతో శ్రీకాకుళం మహమ్మదీయులు సైన్యాన్ని ఓడించి శత్రు గ్రామాలను వసపరుచుకున్నాడు. 1713లో గాజులరేగ సమీపంలో విజయపురి అనే గ్రామాన్ని నిర్మించారు. అక్కడ రాతి కోట (మిగతా.. 8లో)

కూటమి అసమర్థ పాలన

వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి-పూసపాటిరేగ



అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వలేని కూటమి ప్రభుత్వానిది ఒక అసమర్ధ పాలన అని వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు విమర్శించారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

40 ఏళ్ల అనుభవం అంటూ ప్రచారం చేసుకుంటూ పాలన గాడికి వదిలేయడం కూటమి ప్రభుత్వంలో చూస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు సంక్షేమ పథకాలు అందక అల్లాడుతున్నారు. ఏ పథకం అమలు చేసినా అందుతుందో లేదోనని ప్రజల్లో ఆందోళన మొదలవుతోంది. ఎక్కడ మమ్మల్ని సాంకేతిక సమస్యతో పక్కన పెట్టేస్తారోనని ఆవేదనలో ఉన్నారు. ప్రతి పథకానికి సాంకేతిక పేరు చెప్పి అర్హులకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారు. సూపర్ సిక్స్ అమలులో చతికిల బడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వకపోగా కొత్త పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వికాలంగులపై మీ ప్రతాపం ప్రజలంతా చూస్తున్నారు. వైసిపి పోరాటం చేస్తేనే ఏదో ఒక పథకం అమలు చేస్తున్నారు. చేసింది కూడా తూతూ మంత్రంగా అరకొరే ఇస్తున్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా?. సంక్షేమాన్ని విస్మరించి కుంటు సాకులతో కాలయాపన చేస్తున్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గంలో మత్స్యకారులకు ఏమైనా ఉపయోగ పడే కార్యక్రమాలు చేపట్టారా? కనీసం తాగునీరైనా సక్రమంగా ఇవ్వగలుగుతున్నారా ? రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వాన్ని ఏనాడూ చూడలేదు. ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

నాటి కుంబిలాపురమే నేటి కుమిలి


(7వ పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టాడు. కోట నిర్మాణం పూర్తి కాకముందే 1717లో ఆయన మృతిచెందాడు. ఆనందరాజు కుమారుడు పెదవిజయరామ రాజు కుంబిలా పురం (కుమిలి) నుండి రాజధానిని విజయపురికి మార్చాడు. అక్కడ నుండే పాలన సాగించారు. కాలక్రమేన విజయపురి విజయనగరంగా మారింది.

కాలక్రమంలో రాజులు పోయారు...రాజ్యాలు పోయాయి...కానీ వారు నడయాడిన నేలతో పాటు వారు నిర్మించిన కోటలు, పూలతోటలు, మసీదులు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. విజయనగర సామ్రాజ్య వైభవం ఇక్కడ నుండే ప్రారంభమైందని కుమిలి ప్రజలు గొప్పగా చెప్పుకుని ఆనందం వ్యక్తంచేస్తుంటారు. మిగిలిపోయిన మట్టి కోట ఆనవాళ్లను చూపిస్తూ పూర్వ వైభవం గురించి కుమిలి గ్రామస్తులు గర్వంగా చెబుతారు. తాము ఈ చారిత్రక ప్రాధాన్యత గల గ్రామంలో ఉన్నందుకు సంతోషిస్తున్నామని పిన్నలు, పెద్దలు చెబుతుంటారు. మహారాణుల కోసం ఇక్కడ వేసిన పూల తోటలు నేడు కుమిలి గ్రామస్తులకు జీవనాధారంగా మారిందని అంటున్నారు.

పూర్వీకుల కథనం...

క్రీ.శ. 13వ శతాబ్ధం నుండి 17వ శతాబ్ధం వరకూ కుంబిలాపురంలో పాలన జరిగేదట. ఇక్కడ సుమారుగా 30 ఎకరాల స్థలంలో మట్టి కోట నిర్మాణం చేశారని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మట్టి కోట కుమిలిపోవడంతో మట్టి దిబ్బలు ఉన్నాయి. మట్టి కోట శిథిలమైపోతున్న సమయంలో రాజు రాజ్య విస్తరణలో భాగంగా కోట మరో ప్రాంతంలో కట్టాలని నిర్ణయించారని కథనం. వీర గడ్డ కోసం వెతుకులాట ప్రారంభమైందట. ఒక రోజున రాజు వేట నిమిత్తం ప్రస్తుతం విజయనగరంలో ఉన్న కోట వైపు కుమిలి కోట నుండి బయలుదేరారు. రాజు గుర్రంపై వెళ్తూ తన వద్ద ఉన్న కుక్కలను ముందుగా వదిలారట. విజయనగరం సమీపంలో కుక్కల ముందు చెమరపిల్లి పరుగులు పెట్టిందట. ప్రస్తుతం విజయనగరం కోట ఉన్న స్థలంలోకి రాగానే వేట కుక్కలపై చెమలపిల్లి తిరగబడిందట. దాంతో రాజు ఆ దృశ్యాన్ని చూసి ఈ స్థలం వీరగెడ్డని గుర్తిం చారట. అందుకే రాతి కోటను అక్కడ నిర్మిం చారట. అప్పటికే కుమిలిలో మట్టితో నిర్మాణం చేసిన కోట కుమిలిపోయే స్దితిలో ఉండడంతో రాతి కోట నిర్మాణం పూర్తయిన వెంటనే కుమిలి నుండి విజయనగరానికి మకాం మార్చారని కతనం ఈ ప్రాంతంలో ఉంది.



గతంలో కోట ఉండే స్థలం ఇదే

ఒకే రకమైన సాదృశ్యం

కుమిలి, విజయనగరానికి నాటికి, నేటికి ఒకే రకమైన సాదృశ్యాలు కనబడతాయి. కుమిలి మట్టి కోట చుట్టూ శత్రువులు కోటలోకి ప్రవేశించకుండా కందకం తవ్వి ఉంది. ప్రస్తుతం విజయనగరం కోట చుట్టూ శత్రువులు కోటను తాకకుండా కందకం తవ్వి ఉంది. కుమిలిలో ఉన్న పెద్ద చెరువు తూర్పు బాగాన మట్టి కోట ఉంది. విజయనగరంలో కూడా పెద్ద చెరువుకు తూర్పు బాగాన కోట నిర్మాణం చేశారు. కుమిలి కోటకు ముందు బాగాన మెట్టపై మసీదు నిర్మించారు. విజయనగరం కోట మందు దర్గా ఉంది. కుమిలిలో ఎన్ని వీదులు పేర్లు ఉన్నాయో విజయనగరంలో కూడా అన్ని వీధులు పేర్లు ఉన్నాయి.



కుమిలి గ్రామం

ఊరు పేరు మార్పు కోసం కృషి

మా గ్రామం చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండడం చాలా ఆనందమని గ్రామస్తులు చెబుతున్నారు. మేము ఉన్న ఈ స్దలం ఒకప్పుడు వీరగడ్డని తెలియడంతో మాకు సంతోషంగా ఉంటుందన్నారు.కుంబిలాపురంగా వెలుగొందిన ఈ గ్రామానికి మళ్లీ అదే పేరు పెట్టేలా గ్రామస్తులమంతా కృషి చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు. కోట కుమిలి పోవడంతో కుమిలిగా పేరు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం పురాతన దేవాలయం మా గ్రామంలో ఉంది. మా గ్రామాన్ని ప్రస్తుతం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

కాలగర్భంలో కోట భోగాపురం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఒకప్పుడు రాజులు ఏలిన ఊరు.. మహారాణులు నడయాడిన నేల.. రాచరిక వైభోగాలతో విరాజిల్లిన గ్రామం.. కాలంతో పరిగెత్తలేక కాలగర్భంలో కలిసిపోయింది.. చరిత్ర పుటలకు అందని దూరంలో మునిగిపోయింది.. చంపావతి నదీ తీరాన కొలువైన మట్టి కోట వరదల్లో శిథిలమైంది.. అక్కడ పాలించిన రాజవంశాలు తరలిపోయాయి. శతాబ్ధాల చరిత్ర శిథిల సాక్షాలు ఇంకా సజీవంగానే దర్శనమిస్తున్నాయి.. నేటికీ ఈ గ్రామం రెవన్యూలో 200 ఎకరాల భూమి ఉంది.. కాలక్రమేణా ఊరంతా తరలిపోయినా పేరు మాత్రం ఇంకా మిగిలే ఉంది.. అదే కోట భోగాపురం..

జాతీయ రహదారిని ఆనుకొని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం సరిహద్దులుగా చంపావతి నదీ తీరాన కోట భోగాపురం ఉంది. ఇక్కడ విజయనగర పాలకుల పూర్వీకులు తమ్మిరాజ్‌దేవ్ అనే మహారాజు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. కోట లోపల నేలమాలిగలు, నీటి కొలనులు, చుట్టూ పూలతోటలతో గుర్రాలు, పశువులు అధిక సంఖ్యలో కొలువు దీరిన కోట ఇది. శతాబ్ధాల క్రితం చంపావతిలో వచ్చిన భారీ వరదల తాకిడికి ఈ కోట శిథిలమైపోయిందని చెబుతుంటారు. దీంతో తమ్మిరాజ్ దేవ్ ఇక్కడ నుంచి కుమిలి కోటకు తరలిపోయారంటారు. ప్రస్తుతం భోగాపురం మండలంలోని నందిగాం పంచాయితీ పరిధిలో ఉన్న ఈ గ్రామంతా ప్రస్తుతం మట్టి పోగులతో దర్శనమిస్తుంటుంది. ఆ దిబ్బలపై నీలగిరి, సరుగుడుతోపాటు డొంకలతో అడవిని తలపిస్తున్న వృక్షాలతో నిండిపోయి ఉంది.

పేరే తప్ప ఊరు లేదు

పేరు గొప్ప ఊరు దిబ్బ అనే నానుడు ఈ గ్రామానికి సరిగా సరిపోతుందని చెప్పాలి. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన ఈ కోట నేడు మట్టి దిబ్బగా మారిపోయింది. ఈ గ్రామానికి పేరే తప్ప ఒక్క కుటుంబం కూడా నివాసం ఉండడంలేదు. కాలక్రమేనా కోటకు చెందిన భూములన్నీ సమీపంలో ఉన్న కొప్పెర్ల, నడిపల్లి, నాతవలస, సింగవరం గ్రామస్తుల వశమయ్యాయి. ప్రస్తుతం అందులో భూములన్నీ రైతులు పేరిట జిరాయితీలుగా మారిపోయాయి.

సజీవంగా ఉన్న జాడలు

అక్కడ కోట శిథిలమై శతాబ్ధాల క్రితమే రాజులు తరలిపోయారు. ఆనాటి కోటంతా నేలమట్టమైంది. ఆ ప్రాంతమంతా మట్టి దిబ్బలుగా పేరుకుపోయింది. కోట సమీపంలో తాగునీటికి ఏర్పాటు చేసికొన్న నీటి కొలనులు బీడుభూములుగా మారిపోయాయి. గుర్రాల, పశువులకు ఏర్పాటు చేసిన నీళ్ల కుండీలు జాడలు నేటికీ కనిపిస్తుంటాయి. అప్పటి రాతి స్తంభా నేటికీ దర్శనమిస్తుంటాయి.

ఔషధ మొక్కలు

శతాబ్ధాల కాలం నుంచి ఇక్కడ భూమి ఖాళీగా ఉండడంతో అడవిని తలపించేలా చెట్లు, డొంకలు పెరిగిపోయాయి. కోట సమీపంలో నుంచి చంపావతి నదిలోకి నీరుపారే పిల్ల కాలువవంతా వృక్షాలతో భయానక ప్రదేశంగా మారిపోయింది. ఆ ప్రాంతంలో వన మూలికలను ఇచ్చే వృక్షాలు అధిక సంఖ్యలో ఉన్నాయని రైతులు చెబుతుంటారు. అందువల్లే విష సర్పాలు సైతం ఈ ప్రాంతలో పడగ విప్పవని నమ్ముతుంటారు. ఇక్కడున్న కాలువలో పారే నీరు తాగితే జబ్బులు నయమవుతాయని చెబుతుంటారు.

కోట సామాలమ్మ కాపలా

మహారాజుల పాలించే కాలం నుంచి అక్కడ సామాలమ్మ అనే దేవత ఆ ప్రాంతాన్ని సంరక్షిస్తున్నట్లు అక్కడ రైతుల నమ్మకం. కోట ప్రాంతంలో రోజూ అర్ధరాత్రి ఒక ఎన్నుపోతు తిరుగుతుంటుంది. దాని వెనుక సామాలమ్మ దేవత మువ్వల శబ్ధంతో పహరా కాస్తుందని చెప్పుకుంటారు. ఈ ప్రాంత రైతులంతా ఏటా సామాలమ్మకు మొక్కలు తీర్చుకుంటారు. అందుకే ఆమెను కోట సామాలమ్మ అని అంటారు.

తరలిపోయిన భోగాపురం

నదీ తీరంలో ఉన్న కోట భోగాపురంపై ప్రకృతి కోపించడంతో వరదలు ముంచెత్తాయి. దాంతో రాజులు తరలిపోవడంతోపాటు అక్కడ నుంచి గ్రామం కూడా నది తీరానికి దూరంగా వెళ్లి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం భోగాపురవాసులంతా అంతా పూర్వం కోట భోగాపురం నుంచి తరలి వెళ్లినవారేనని పూర్వీకులు చెబుతుంటారు.

ఈ ప్రాంతం అభివృద్ధే ధ్యేయం



ఈ ప్రాంతాలు అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఆహర్నిషలు పనిచేస్తున్నారు. ఆయనకు తగ్గట్టుగానే ఎమ్మెల్యే లోకం నాగమాధవి పనిచేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు, అభివృద్ధే ధ్యేయమని నిరంతరం తపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే గుంతలు రోడ్డ పూడ్చి రహదదారి సౌకర్యం కల్పించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుంది. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజల పక్షాన నిలబడ్డారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జలపారి శివ, జనసేన మండల అధ్యక్షులు, పూసపాటిరేగ మండలం

సూపర్ సిక్స్‌లో విఫలం



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయడంలో విఫలమైంది. మాది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడమే తప్ప పాలనలో ఏమాత్రం ప్రజలు పక్షం లేదు. సూపర్ సిక్స్ పేరు చెప్పి అరకొర సంక్షేమమే అందిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఈ ప్రభుత్వం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముందు చెప్పిన సంక్షేమం, అభివృద్ధి కనిపించడం లేదు. ముఖ్యంగా మహిళలు, రైతులు, విద్యార్థులు సంతృప్తిగా లేరు. గత పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో గ్రామాలు, ప్రజలు సంతోషంగా ఉండేవారు. సంక్షేమ పథకాలు ఇవ్వడానికి లోటు బడ్జెట్ అని చెబుతున్నారు. మరి ఎలా ఎన్నికలు హామీ ఇచ్చారు. యూరియా లేక రైతులు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. 40 ఏళ్ల అనుభవం ఏమైంది? ఇదేనా మీ 40 ఏళ్ల అనుభవం? మళ్లీ వైసిపితోనే అన్ని వర్గాలూ అభివృద్ధి, సంక్షేమంతో సంతోషంగా ఉంటాయి.

- ఎం.సత్యనారాయణరాజు, వైస్ ఎంపిపి, పూసపాటిరేగ

చింతపల్లి తీరం పగడాల హారం

మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సహజ సంపద



చింతపల్లి తీరంలో తాజాగా శాస్త్రవేత్తలు గుర్తించిన అరుదైన పగడాల దిబ్బలు చక్కని సహజ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సముద్ర గర్భంలో అరుదైన ప్రక్రియల వల్ల ఏర్పడే ఈ పగడాలు దిబ్బలు భారత తీర రేఖలో అరుదుగా కనిపిస్తాయి. చింతపల్లి తీరంలో విస్తరించి ఉన్న ఇవి దాదాపు 3 కిలోమీటర్ల మేర 12 దిబ్బలు పరిశోధనల ద్వారా వెలుగుచూశాయి. ఇంత విలువైన సహజ సంపదకు చింతపల్లి సముద్రం వేదిక కావడంతోపాటు ఇక్కడి సాగర గర్భంలోని సముద్రపు శిలా పర్వతం, గొల్యాత్ శిథిలాలు.. అన్నీ కలిపి జిల్లాకు అపూర్వమైన సహజ సంపదే. సముద్రపు మణిహారంగానూ మార్చాయి. దాంతో దేశంలోనే అత్యంత ఖరీదైన జల క్రీడ స్కూబా డ్రైవింగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది. చింతపల్లి తీరం ఇప్పుడు కేవలం ఒక సముద్రతీరం మాత్రమే కాదు, ప్రకృతి రత్నబాంఢాగారమని చెప్పక తప్పదు. ఇది దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదగనుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి సముద్ర తీరం.. పగడాల దిబ్బల ప్రకృతి అందాలతోపాటు మత్స్యకారులకు వరంగా మారింది. ఈ దిబ్బలు ఏర్పడిన చోట చేపలు ఎక్కువగా దొరుకుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ దిబ్బల్లో అరుదైన చేపలు ఆవాసాలుగా మార్చుకుంటాయి. ఈ తీరంలో పర్వత శిలాతోరణం ఉన్న ప్రాంతంలోనే సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో 12 పగడాల దిబ్బలను గుర్తించినట్లు సముద్ర శాస్త్రవేత్తలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పగడాల సముదాయాన్ని 'పగడాల హారం'గా పరిగణిస్తున్నారు. ఇవి సముద్రం లోపల జీవించే చిన్న జీవులైన పాలిప్స్, సజీవ చర్యల వల్ల ఏర్పడిన అద్భుత జీవశిలలు. చింతపల్లి సముద్ర గర్భంలోని ఈ పగడాల హారం, గొల్యాత్ శిథిలాలు, సాగర శిలా పర్వతం పర్యాటక ప్రాంతంతోపాటు మత్స్యకారులుకు వరంగా మారాయి. జీవ వైవిధ్యం ఉట్టిపడే ఈ పగడాల దిబ్బలతో చింతపల్లి తీరం ఇప్పుడు శాస్త్రీయ పరిశోధనలకు కేంద్ర బిందువుగా మారింది.

ఈ ప్రాంతంలో పగడాలు ఎలా ఏర్పడ్డాయి? అక్కడ శిలా తోరణం, శిథిలాల వయస్సు ఉన్న 'గొల్యాత్' అనే ఓడ తాత్కాలిక నిర్మాణమా? శాశ్వత నౌక శిథిలమా? సముద్ర పర్వత భౌగోళికం ఇది టెక్టానిక్ ప్లేట్ క్రియలనాడా లేక శిలా వృద్ధి వల్లా? ఇలా ప్రతీ అంశం పరిశోధకులకు పెద్దప్రశ్నగా మారింది.

పర్యాటక అభివృద్ధి

పగడాల ప్రాంతాన్ని స్నోర్కెలింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహస క్రీడలకు అభివృద్ధి చేయవచ్చు. సముద్రంలో శాస్త్రీయ పరిశోధనలకు కేంద్రంగా మారుతుంది. ఇది విశ్వవిద్యాలయాల పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తద్వారా చింతపల్లి గ్రామం పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశముంది. ప్రభుత్వ సహకారం అందితే, స్థానికులకు ఉపాధి, యువతకు శిక్షణ, పర్యావరణ విద్య పెరగొచ్చు. ఇలాంటి సహజ సంపదలపై అవగాహన పెంచడంలో పాఠశాలలు, కాలేజీలకు సహకారం కలగవచ్చు.

పగడాలకు రక్షణ అవసరం

ఈ అరుదైన ప్రకృతి సంపద భవిష్యత్తు కోసం రక్షణ అవసరం ఎంతైనా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పగడాల పరిరక్షణకు చట్టబద్ధమైన చర్యలు, సామూహిక భాగస్వామ్యం అవసరం. చింతపల్లి సముద్ర పగడాలు నాశనమవ్వకుండా ఉండాలంటే ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పడకుండా జాగ్రత్త పడాలి. అసాధారణ మత్స్యవేట నియంత్రణ ఉండాలి.

పగడాల మధ్య 'గొల్యాత్' శిథిలాలు

చింతపల్లి సముద్ర గర్భంలో 'గొల్యాత్' అనే ఓడ శిథిలాలు ఉన్న సంగతి తెలిసిందే. ఇది వందేళ్లకు పైగా సముద్ర గాథకు ఆధారం సూచిస్తుండగా, ఓడ శిథిలాల చుట్టూ పగడాల హారం ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. తీరం నుండి పది కిలోమీటర్ల దూరంలో సముద్రపు పర్వతం ఉండడంతో సముద్ర తక్కువ లోతులో ఓ శిలా నిర్మాణం ఏర్పడింది. ఈ శిథిలాల వద్ద ఒక పెద్ద సముద్రపు శిలా పర్వతం ఉన్నట్లు గుర్తించారు. ఇది ప్రకృతి స్వభావంగా ఏర్పడిందా? లేక పురాతన మానవ నిర్మిత నిర్మాణం శిథిలమైందా? అనే అంశంపై అధ్యయనం జరుగుతోంది. అయితే ఆ పర్వతంపై గొల్యాత్ నౌక శిథిలాలు, చుట్టూ పగడాల అభివృద్ధి, ఆ ప్రాంతంలో చెప్పగలిగిన జీవవైవిధ్యం ఇవన్నీ కలిపి ఈ ప్రదేశాన్ని విజయనగరం జిల్లా రహస్యమైన అద్భుత గర్భంగా నిలబెడుతున్నాయి.

పర్యాటక స్వర్గధామం

ఈ ప్రాంతాన్ని రెండేళ్ల క్రితం నుండే స్కూబా డ్రైవింగ్‌కు అత్యుత్తమ ప్రదేశంగా ఎంపిక చేశారు. సముద్రపు లోతుల్లో ప్రకృతి కళాఖండాలు, పగడాల రంగులు, జీవాలు, శిథిలాలు ఇవన్నీ చూసేందుకు జల ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. రంగురంగుల చేపలు, పగడాల మధ్య కదులుతున్న సముద్ర జంతువులు, శిలాశిల్పంగా ఉన్న శిథిల భాగాలు వీటన్నింటిని చూడాలంటే ఇది సాహస పర్యాటకానికి స్వర్గధామం. స్కూబా డైవింగ్‌కు పర్యాటక ఆకర్షణ. ఇది ఈ ప్రాంతానికి పర్యాటక రంగం ద్వారా ఆదాయ వనరులను తీసుకురావచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

తీర రక్షణ కవచం


ఈ సహజ సిద్ధమైన పగడాల హారం తీర రక్షణ కవచంలో ఉపయోగపడుతోంది. ఈ పగడాల గుణాల వల్ల సముద్రపు అలల ప్రభావాన్ని తగ్గించే సహజ రక్షణ గోడగా పనిచేస్తాయి. అరుదైన చేపలకు ఆలవాలంగా మారతాయి. తీరాన్ని రక్షించేందుకు ఉపయోగపడతాయి. పగడాల వల్ల సముద్రపు బయోలాజికల్ డైవర్సిటీ (సజీవ వైవిధ్యం) పెరుగుతుంది.

ఆర్థిక ప్రయోజనాలు

పడగాల దిబ్బలు సముద్ర జీవులకు నివాస ప్రదేశంగా పనిచేస్తాయి. స్థానిక మత్స్యకారులకు ఆదాయ మార్గంగా మారే అవకాశం ఉంది. పగడాల చుట్టూ ఎక్కువగా చేపలు కనిపించే అవకాశముంటుంది. దాంతో మత్స్యకారులకు చేపలు లభ్యమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పగడాల నిక్షేపాలు స్థానిక మత్స్యకారులకు, స్థానిక వ్యాపార అభివృద్ధికి కొత్త దారి చూపనున్నాయి. ప్రభుత్వం ఈ ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకునేలా పర్యాటక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తే, ఈ ప్రాంతం ఆర్థిక పరంగా బలపడుతుంది. అంతేకాదు, ఈ పగడాల అధ్యయనం ద్వారా వాతావరణ మార్పులు, సముద్ర జీవ వ్యవస్థ గురించి తెలుసుకునే అవకాశం కూడా ఉంది.



శిథిల నౌక



చింతపల్లి తీరంలో అరుదైన జలచరం



నెరవేరనున్న దశాబ్దాల కల

శరవేగంగా ఫైర్‌స్టేషన్ పనులు



ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ నడుమ అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు అసెంబ్లీ ఎన్నికల హామీల్లో ఇదొకటని చెప్పాలి. అయితే ఫైర్‌స్టేషన్ కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారు. కార్యరూపం దాల్చడానికి అనేక అడ్డంకులు వచ్చాయి. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నం సాగించారు. చివరికి టిడిపి కూటమి ప్రభుత్వంలోనే, జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి మరింత గట్టిగా పట్టుబట్టారు. చివరికి ఫైర్‌స్టేషన్ కార్యరూపం దాల్చి పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో మూడు దశాబ్దాల నాటి ఈ ప్రాంత ప్రజల కల త్వరలో నెరవేరబోతోంది.

తీరప్రాంత మండలాలైన భోగాపురం, పూసపాటిరేగలో ఎక్కువగా పూరిళ్లు ఉండేవి. అగ్నిమాపక కేంద్రం దగ్గరలో లేక ఎన్నో పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లో పక్కా భవనాలు ఉన్నప్పటికీ అగ్ని మాపక కేంద్రం అవసరం ఎంతో ఉంది. దీంతో అగ్ని మాపక కేంద్రం అవసరమని మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు గుర్తించారు. అందుకోసం ఎంతో పోరాటం సాగించారు. ఈ ప్రాంతమంతా పరిశ్రమలతో ఉండడంతో అగ్నిమాపక కేంద్రం అవసరత పెరిగింది. మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారికి సమీపంలో సుమారుగా 2.25 కోట్లు అంచనాతో ఫైర్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పునాదులు పడ్డాయి. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. అగ్నిప్రమాద బాధల నుంచి గట్టెక్కుతామన్న సంతోషం ప్రజల్లో ఉంది. ఏదేమైనప్పటికీ ఏళ్ల నాటి కల నిజమవుతోందని నియోజకవర్గంలో పలువురు అంటున్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



సంక్షేమం, అభివృద్ధి టిడిపికి రెండు కళ్లులాంటివి. ఒకదాని కోసం ఇంకోటి విస్మరించదు. ఎందకంటే ఆయన విజనరీ లీడర్. భవిష్యత్తును ముందుగానే పసిగట్టగల సమర్థుడైన నాయకుడు చంద్రబాబు. అందుకే ప్రజలు ఇంతగా పట్టం కట్టారు. టిడిపితోనే ఈ రాష్ట్రంగాని, ప్రాంతం గాని అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్ముతారు. దానికి తగ్గట్టుగానే ప్రజలు తీర్పు ఇచ్చిన సంగతి మనకు తెలిసిందే. ఎన్నికలు ముందు ఏదైతే వాగ్దానం చేసారో ఆ సూపర్ సిక్స్ ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నారు. ప్రజలందరూ సంక్షేమం పథకాలు అందుకొని సంతోషంగా ఉన్నారు. తల్లికి వందనం పిల్లలందరికీ ఇచ్చే ఘనత ఈ పార్టీకే ఉందని చెప్పాలి. చెప్పిన మాట ప్రకారం పింఛన్‌లు పెంచి ఇస్తున్నారు. కొత్తగా అర్హులైన వారికీ మంజూరు చేస్తున్నారు. సుపరిపాలనకు అర్థం అంటే ఏంటో చూపించారు. గతకలు రోడ్లుకు మోక్షం కలిగించారు. గత ప్రభుత్వం చేసిన విచ్ఛిన్నంను సరిదిద్దికుంటూ రాష్ట్రంను గాడిలో పెడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడం చాలెంజ్‌తో కూడినది. అయినా ఇచ్చిన మాట తప్పకుండా సూపర్ సిక్స్‌లో బాగంగా తల్లికి వందనం, గ్యాస్ బండలు, అన్నతాత సుఖీభవ, ఉచిత బస్సు ఇస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వానికి మనం సహకారంగా ఉండాలి.

- మహంతి చిన్నంనాయుడు,
టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి